
పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
సోమవారం 16, జూన్ 2025

ఉపాధి పథకం వివరాలు	
జిల్లాలో జాబ్‌కార్డులు	4.49 లక్షలు
జాబ్‌కార్డుల్లో నమోదైన కూలీలు	8.33 లక్షలు
పనులకు వచ్చే కుటుంబాలు	3.76 లక్షలు
పనులకు హాజరయ్యే కూలీలు(ఏడాదిలో)	6.69 లక్షలు
ఈ ఏడాది పనిదినాల కల్పన లక్ష్యం	1.11 కోట్లు
ఇప్పటివరకు జరిగిన పనిదినాలు	65.57 లక్షలు
పనులకొచ్చిన కూలీలు(ఈ ఏడాది ఇప్పటివరకు)	4.36 లక్షలు
రోజు వారీ లభించిన సగటు వేతనం	రూ.251.85
ఇప్పటివరకు చేసిన పనుల వేతన మొత్తం	రూ.165.05 కోట్లు
కూలీలకు ఇప్పటివరకు చెల్లించినది	రూ.5 కోట్లు
పెండింగ్ వేతనాల మొత్తం	రూ.160.05 కోట్లు

జిల్లాలో లక్షలాది మంది ఉపాధి కూలీలు వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేని సమయంలో ఆసరాగా ఉన్న ఉపాధి పనులకు లక్షల సంఖ్యలోనే జనం హాజరు అవుతుండగా నెలల తరబడి చేసినా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. జూన్ నెల అన్ని వర్గాలకు అత్యంత కీలకం కాగా ఈ సమయంలో చేసిన పనులకు డబ్బులు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రతి ఏటా ఈ సమయంలో రోజువారీ పనులకు వచ్చే కూలీల సంఖ్య భారీగా ఉంటుంది. నిర్దేశిత లక్ష్యంలో అధిక భాగం పనులు ఈ సమయంలోనే పూర్తిచేస్తారు. ప్రస్తుతం వేతనాలు పెండింగ్ ఉండడంతో పలుచోట్ల కూలీల రోజువారీ హాజరు తగ్గిపోతున్నట్లు సమాచారం.



ఒక వారం మాత్రమే ఇచ్చారు

అధికార వర్గాల సమాచారం ప్రకారం.. 65.57 లక్షల పనిదినాలు ఇప్పటివరకు జరిగాయి. దాదాపు 2.55 లక్షల కుటుంబాలకు చెందిన 4.36 లక్షల మంది ఈ పనులు చేశారు. సగటున రోజుకు రూ.251.85 వంతున రూ.165.05 కోట్ల విలువైన పనులు చేశారు. అయితే అందులో కేవలం రూ.5 కోట్లు మాత్రమే వేతనాలు ఇప్పటి వరకు ఉపాధి పనులు చేసిన వారికి అందాయి. ఇంకా సుమారు రూ.160 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే అసలు ఈ సీజన్ ఆరంభం అయిన ఏప్రిల్ ఒకటి నుంచి ఇప్పటి వరకు పది వారాలు పనులు జరిగితే కేవలం తొలి వారం చేసిన పనులకు మాత్రమే వేతనాలు కూలీలకు అందాయి. ఇంకా తొమ్మిది వారాలకు సంబంధించి పెండింగ్ ఉన్నాయి.

రూ.160 కోట్లు

- ఉపాధి హామీ వేతన బకాయిలు
- రెండు నెలలకుపైగా అందని వైనం

- ఇబ్బందులు పడుతున్న కూలీలు
- చేసిన పనుల విలువ రూ.165.05 కోట్లు
- ఇచ్చింది రూ.5 కోట్లు మాత్రమే

ఒంగోలు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలు ఆకలి కేకలు పెడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు రూ.160 కోట్లకుపైగా వేతనాలు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. పనులకు హాజరైన కుటుంబాలకు సగటున ఒక్కో కుటుంబానికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు రావాల్సి ఉంది. జిల్లాలో గత ఏడాది 2.96 లక్షల కుటుంబాలకు చెందిన 5.07 లక్షల మంది పనులకు వచ్చారు. కోటి 35 లక్షల పని

కీలక సమయంలో డబ్బులు అందక ఆందోళన

దినాలు కల్పించగా సగటున రోజుకు రూ.211 వంతున సుమారు రూ.273.57 కోట్ల మేర వారికి వేతనాల రూపంలో దక్కాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జిల్లాలో కోటి 11 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్ణయించారు. సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ ఆఖరు వరకు మూడు నెలల్లోనే మూడొంతుల పని దినాలు పూర్తిచేస్తారు. అయితే ఈ ఏడాది అది కూడా ఇంకా పూర్తికాలేదు.


పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

- **జూన్ ఖర్చుల నేపథ్యంలో..**

సాధారణంగా పేద కుటుంబాల వారు వేసవిలో ఉపాధి పనులకు రావడం ద్వారా వచ్చే నగదుతో అధికంగా జూన్‌లో పిల్లల చదువులకు సంబంధించి ఫీజుల చెల్లింపు, కొత్త దుస్తులు, పుస్తకాల కోసం ఖర్చుచేస్తుంటారు. ఇలాంటి కీలక సమయంలో డబ్బులు అందకపోవడం ప్రతిబంధకంగా మారింది. మరోవైపు నెలలు తరబడి వేతనాలు రాకపోవడంతో ఆర్థిక అవసరాల కోసం చాలాచోట్ల కూలీలు ఉపాధి పనులకు రాకుండా ఇతర పనులకు వెళ్తున్నారు. దీంతో ఉపాధి కూలీల రోజు వారీ హాజరు తగ్గిపోతోంది. సాధారణంగా ఈ సమయంలో రోజువారీ 2.25లక్షల నుంచి 2.50 లక్షల మంది పనులకు వస్తారు. అయితే ప్రస్తుతం లక్షా 75 వేలకు అటుఇటుగా మాత్రమే వస్తున్నట్లు సమాచారం. దీనివల్ల ఉపాధి పనుల మెటీరియల్ కోటా నిధులు కూడా తగ్గిపోయే పరిస్థితి కనిపిస్తోంది.

- **నిధులు రాకనే ఇబ్బందులు**

ఉపాధి పనులకు సంబంధించి ఇచ్చే వేతనాలలో 90శాతం కేంద్రప్రభుత్వం వాటా ఇవ్వాలి. కాగా సకాలంలో అక్కడి నుంచి నిధులు రాక ఈ పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది. గతంలో ఇలాంటి సమయంలో రాష్ట్రప్రభుత్వం సర్దుబాటు చేసి అనంతరం కేంద్రం నుంచి నిధులు వచ్చినప్పుడు తీసుకొనేది. అయితే ప్రస్తుత నిబంధనల ప్రకారం చెల్లింపు నేరుగా కూలీల ఖాతాలకు జమచేయడం, రాష్ట్రప్రభుత్వ ఆర్థిక పరిస్థితి సరిలేకపోవడంతో కేంద్రం నుంచి నిధులు వస్తేనే తప్ప కూలీలకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదు. దీని వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

భారీగా యోగా

- 21వ తేదీన 6,758 ప్రాంతాల్లో పది లక్షల మందితో ఆసనాలు
- ఇప్పటికే యాప్‌లో 9.60లక్షల మంది పేర్లు నమోదు
- జిల్లా వ్యాప్తంగా అవగాహన, శిక్షణ కార్యక్రమాలు
- పాకల బీచ్‌లో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్, ఎస్పీ
- 20న ఒంగోలులో పొదుపు మహిళలతో కార్యక్రమం

ఒంగోలు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 21న రాష్ట్రప్రభుత్వం యోగాంధ్రప్రదేశ్ పేరుతో వైజాగ్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొననుండగా అక్కడ ఐదు లక్షల మందితో నిర్వహించేలా భారీ ఏర్పాట్లు చేస్తుంది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా లక్ష ప్రాంతాల్లో రెండు కోట్ల మంది యోగాసనాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ మేరకు జిల్లాలో 9.60లక్షల మందితో యోగా డే నిర్వహణకు ఆదేశించగా పది లక్షల మందితో నిర్వహించేలా కలెక్టర్ అన్సారియా ప్రణాళిక రూపొందించారు.

- **పాకల బీచ్‌లో అవగాహన**

వారానికి ఒక ప్రత్యేకమైన ప్రాంతాలలో భారీగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఆ ప్రాంత ప్రజల్లో అవగాహన పెరిగేలా చేశారు. అలా


యోగాంధ్రలో మంత్రి, కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఇతర అధికారులు

ఇదివరకే గుండ్లకమ్మ ప్రాజెక్టు, త్రిపురాంతకం దేవాలయం, కొత్తపట్నం బీచ్‌ల వద్ద నిర్వహించగా తాజాగా ఆదివారం పాకల బీచ్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. మంత్రి డాక్టర్ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా. ఎస్పీ దామోదర్‌తోపాటు అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో రంగానికి చెందిన వారితో ఒక్కో రోజున ఒక్కో జిల్లాలో భారీ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశించింది. అందులోభాగంగా ఈనెల 20న ఒంగోలులో దాదాపు 5వేల మంది పొదుపు మహిళలతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తిచూపే వారిని సచివాలయ సిబ్బంది యోగాంధ్రయాప్‌లో నమోదు చేశారు. వారికి నెల రోజుల నుంచి జిల్లా, మండల స్థాయిలో యోగా శిక్షకులతో శిక్షణ కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 9.60 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

ముందుగా యోగా శిక్షణ

జిల్లావ్యాప్తంగా అన్ని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో కార్యక్రమాలు జరిగేలా ఏర్పాటు చేస్తున్నారు. అలా జిల్లాలోని 6,758 ప్రాంతాల్లో పది లక్షల మంది పాల్గొనేలా ప్రణాళిక రూపొందించారు.

నేటి నుంచి వైద్యశాఖలో బదిలీల కౌన్సెలింగ్

జూమ్ విధానంలో నిర్వహణకు రంగం సిద్ధం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగుల బదిలీలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూమ్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. బదిలీల్లో ఏఎన్ఎంలు ఎక్కువసంఖ్యలో మార్పు జరుగుతున్నందున మాన్యువల్ కౌన్సెలింగ్ జరపాలని ఉద్యోగులు కోరుతూ వచ్చారు. ఇప్పటికే జూమ్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. సీనియార్టీ జాబితాను కూడా ప్రకటించారు. ఆ ప్రకారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం పది కేడర్లలో ప్రక్రియ జరగనుంది. సోమవారం నుంచి ప్రారంభించి ఈనెల 19తేదీ నాటికి పూర్తి చేసే విధంగా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.



డీఎల్‌డీవోలకు కీలక బాధ్యతలు

- గత వైసీపీ హయాంలో ఉత్సవ విగ్రహాల్లా..
- టీడీపీ ప్రభుత్వం వచ్చాక గుర్తింపు.. ఉత్తర్వులు జారీ




ఒంగోలు కలెక్టరేట్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీనియర్ ఎంపీడీవోలకు రాష్ట్రవ్యాప్తంగా డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారులు(డీఎల్‌డీవో)గా ఉద్యోగోన్నతులు కల్పించారు. ప్రమోషన్లు వచ్చినా ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదు. డివిజనల్ కేంద్ర పోస్టుల్లో నియమించినా ఎటువంటి పనులు లేవు. జిల్లా కేంద్రంలో పనిచేసే డీఎల్‌డీవోలకు మాత్రం కలెక్టరేట్‌లో అప్పగించిన పనులు మాత్రమే చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం డీఎల్‌డీవోలకు ఏయే బాధ్యతలను అప్పగించాలో విస్తృత కసరత్తు చేసింది.

- **రెవెన్యూ వ్యవస్థ తరహాలోనే..**

రెవెన్యూ వ్యవస్థ తరహాలో డివిజనల్ వ్యవస్థ పంచాయతీరాజ్‌లో ఉండేది కాదు. ఇక నుంచి డివిజనల్ స్థాయిలో కూడా అభివృద్ధి పనుల పర్యవేక్షణకు డీఎల్‌డీవోలకు మరిన్ని అధికారులను కట్టబెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో ఒంగోలు, కనిగిరి, మార్కాపురంలు రెవెన్యూ డివిజన్లుగా ఉన్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం డీఎల్‌డీవోలకు జాబ్‌చార్టును కూడా రూపొందించారు. డీఎల్‌డీవో పరిధిలోకి ఎంపీడీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, డ్వామా ఏపీడీలను తీసుకురానున్నారు. మండల పరిషత్‌లలో జరిగే అభివృద్ధి పనులను పర్యవేక్షించడంతోపాటు ఉపాధి హామీ పథకం కింద జరిగే పనులను కూడా పర్యవేక్షించే బాధ్యతలను అప్పగించారు.

- **ఎన్నికల అథారిటీ కూడా వారికే**

ఇప్పటివరకు జిల్లా ఎన్నికల అథారిటీలుగా ఆర్డీవోలు వ్యవహరిస్తుండగా ఇకపై ఆ విధులను డీఎల్‌డీవోలకు అప్పగించారు. పంచాయతీల్లో ఆడిట్ అభ్యంతరాలతోపాటు పన్నులు, వివిధ రకాల రుసుముల వసూళ్లు పెరిగేలా డీఎల్‌డీవోలు చర్యలు తీసుకోనున్నారు. గ్రామ సచివాలయాల్లో గ్రామీణ తాగునీటి సరఫరా, తదితర అంశాలతో సమన్వయం చేస్తారు.



ఉద్యాన పంటల వైపు రైతుల చూపు

7లో



లక్ష్మీనరసింహుడికి చక్రస్నానం

పాత సింగరాయకొండలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


ప్రమాద స్థలిలో దెబ్బతిన్న వాహనాలు.. చెల్లాచెదరుగా మామిడికాయలు

పొద్దుపొద్దునే ప్రమాదం


మినీ లారీలో ఇరుక్కొన్న కుమార్ స్వామి మృతదేహం

- కూలీలతో వెళ్తున్న మినీ లారీ టైర్ పంక్చరు
- అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మామిడికాయల వాహనాన్ని ఢీ
- తెలంగాణాకు చెందిన డ్రైవర్ మృతి
- 26 మంది కూలీలకు గాయాలు
- వారిలో ఐదుగురి పరిస్థితి విషమం
- అనకుంట వద్ద ఘటన

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి కూలీలతో వెళ్తున్న వాహనం ఎదురు వస్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, 26 మంది కూలీలు గాయపడ్డారు. ఈ ప్రమాదం ఎర్రగొండపాలెం మండలంలోని జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగొండపాలెం మండలం చెన్నరాయినిపల్లికి చెందిన సుమారు 30 మంది కూలీలు మినీ లారీలో మార్కాపురం సమీపంలోని పలు గ్రామాల్లో బొప్పాయి కాయల కోతకు బయలుదేరారు. జాతీయరహదారిపై కొత్తపల్లి సమీపంలోని అనకుంట వద్ద మినీ లారీ టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి ఎదురుగా తిరుపతి నుంచి గురజాల వైపు మామిడి పండ్ల లోడుతో వస్తున్న లగేజీ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తెలంగాణ రాష్ట్రానికి చెందిన నాగర్‌కర్నూలు జిల్లా తుడూరు మండలం, చర్ల తిరుమూర్పూర్ గ్రామానికి చెందిన షీలా కుమార్‌స్వామి(42) అక్కడికక్కడే వాహనంలో ఇరుక్కొని మృతి చెందారు.

లారీలో ఉన్న కూలీలతోపాటు లగేజీ వాహనం డ్రైవర్‌తో సహా 26 మందికి తీవ్ర, స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో వైపాలెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఐదుగురితో పాటు లగేజీ వాహన డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో మార్కాపురం, స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన ఆదిలక్ష్మమ్మ ప్రైవేటు ఆసుపత్రికి...
ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- **తీవ్రంగా గాయపడిన వారిలో...**

రోడ్డు ప్రమాదంలో గాయపడిన చెన్నరాయినిపల్లికి చెందిన కూలీల్లో కాటినేని చిన్నలత, మేకల రవణమ్మ, నల్లబోతుల ఆదిలక్ష్మమ్మ, నల్లబోతుల పెద్దమలయ్య, నల్లబోతుల తిమ్మయ్య, కాటినేని రత్తాలు, కాటినేని వరలక్ష్మి, మేకల చెన్నమ్మ, వన్నెబోయిన అనిల్, పెద్దబాబు, ఎం ఏసోబు, ఎం దీప్తి, వీ వెంకటనారాయణ, డీ రమేష్ నాయక్, ఎం లింగయ్య, కే చెన్నకేశవులు, ఎస్ వెంకటరవణ, ఎం శ్రీను, కే చెన్నయ్య, బీ యల్లయ్యతో పాటు లగేజీ వాహన డ్రైవర్, తెలంగాణ రాష్ట్రం మిర్యాల గూడెంకు చెందిన సందీప్, క్లీనర్ గురజాలకు చెందిన షేక్ సైదాకు గాయాలయ్యాయి. ఎస్ఐ చౌడయ్య ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన కుమార్ స్వామికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మహిళపై దుండగుడి హత్యాయత్నం

రుబ్బురోలు పత్రంతో మోది.. చాకుతో దాడి

బంగారు గొలుసుతో పరారు ● చీమకుర్తి సీహెచ్‌సీ సమీపంలో ఘటన



గాయపడిన పద్మజ

చీమకుర్తి, జూన్15(ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా మహిళ ఉండటం గమనించిన అగంతుకుడు సాధువు వేషంలో రెండు సార్లు ఇంటికి వెళ్లి ఆశీర్వచనం అందించాడు. మాయమాటలు చెప్పి మూడోసారి తన అసలురూపాన్ని బయటపెట్టి హత్యాయత్నం చేయటంతో పాటు మెడలో ఉన్న బంగారు గొలుసుతో ఉడాయించిన ఘటన చీమకుర్తిలో ఆదివారం పట్టపగలు జరిగింది. వివరాల్లోకి వెళితే.. చీమకుర్తి సీహెచ్‌సీ సమీపంలో నివాసం ఉంటున్న గోలి పద్మజ తన భర్త చనిపోవటంతో తన కుమారుని వద్ద నివసిస్తుంది. ఆమె కుమారుడు లారీ డ్రైవర్. కూతురు, అల్లుడు చీమకుర్తిలోనే వేరే చోట నివసిస్తున్నారు. ఈక్రమంలో కుమారుడు డ్యూటీకి పోవడంతో ఒంటరిగా పద్మజ ఉండటాన్ని అగంతుకుడు కనిపెట్టాడు. ఆదివారానికి ముందు రెండు పర్యాయాలు సాధువు వేషంలో పద్మజ ఇంటికి వెళ్లి మాయమాటలు చెప్పాడు. ఇదే క్రమంలో ఆదివారం కాపు కాసి పద్మజ అల్లుడు ఇంటి నుంచి వెళ్లిన తర్వాత ఈ అగంతుకుడు ఇంట్లోకి చొరపడ్డాడు. దాదాపు 40 నిమిషాలు ఇంట్లోనే ఉన్నట్లు పక్కనే ఉన్న ఆసుపత్రి సీసీ కెమెరా రికార్డులు తెలియచేస్తుండటం గమనార్హం. అయితే ఇంట్లో నుంచి తిరిగి వెళ్లేటపుడు సాధువు రూపం నుంచి షార్టు, టీషర్టు వేసుకొని నింపాదిగా వెళ్లటం సీసీ కెమెరాలో చూసిన పోలీసులు సైతం అవాక్కయ్యారు.

బాధితురాలి కథనం మేరకు..

కాగా బాధిత మహిళ, ఆమె అలులడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సాధువు వేషంలో ఇంట్లోకి వెళ్లిన దుండగుడు పద్మజను తొలుత రూ.లక్ష ఇవ్వాలని కోరాడు. ఇందుకు నిరాకరించటంతో ఆమె మెడలో ఉన్న బంగారం గొలుసును లాక్కునే ప్రయత్నం చేయగా ప్రతిఘటించింది. దీంతో పక్కనే ఉన్న రుబ్బురోలు రాయితో తలపై మోది, అక్కడే ఉన్న చాకుతో మెడపై కోసి గొలుసును లాక్కెళ్లిపోయాడు. అయితే 40నిమిషాలు పాటు ఇంట్లో ఏమి జరిగిందనే వివరాలు గాయపడి వైద్యసేవలు పొందుతున్న బాధితురాలు చెప్పలేకపోతుంది. దీంతో సీసీ కెమెరాలు ఆధారంగా అగంతుకుడు ఒంగోలు వైపునకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించి తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ సుబ్బారావు, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కాగా బాధితురాలు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కందుకూరు నుంచి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

● ఎస్పీ దామోదర్

సింగరాయకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ సూచించారు. ఆదివారం సింగరాయకొండ సర్కిల్ కార్యాలయాన్ని, పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌ఆవరణను, గదులను, రిసెప్షన్ కౌంటర్‌ను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో, జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పాతనేరస్తుల కదిలికలపై నిఘా ఉంచాలని, ప్రతి రోజూ విజిబుల్ పో లీసింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ హజరత్తయ్య, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి ఎస్సై బి. మ హేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి



బహుమతిని అందజేస్తున్న కల్యాణి

మద్దిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ద్వితీయ స్థానం సాధించిన కె.వెంకటదిలీప్‌కుమార్‌కు ఉపాధ్యాయురాలు చుంచు కల్యాణి రూ.5వేల ప్రోత్సాహక నగదును అందజేశారు. టెన్త్ పరీక్షల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థికి రూ.10 వేలు బహుమతిగా అందజేసినట్లు ఆమె ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

శ్రీశ్రీకి ఘన నివాళి

మద్దిపాడు, జూన్15(ఆంధ్రజ్యోతి): మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని ఆదివారం మద్దిపాడులోని కళాకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత వర్క్ ఇన్‌స్పెక్టర్ గంటా కోటేశ్వరరావు, రిటైర్డ్ హెచ్‌ఎం కనపర్తి సుబ్బారావు మాటాడుతూ శ్రీశ్రీ రచనలు ప్రతి ఒక్కరూ చదివాలన్నారు. కార్యక్రమంలో నేలటూరి సత్యనారాయణ, గంగిశెట్టి నరసింహారావు, కటకం వెంకటేశ్వర్లు, దిడ్డి రామారావు, ఉండవల్లి సుందర్రావు, ఈమని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటా నికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి ఆస్థానం

ఒంగోలు కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆస్థాన పూజా కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా ఈ పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరి ఝాన్సీరాణి చెప్పారు. గాయకురాలు బొల్లాపల్లి వెంకటఫణిదీప్తి అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు.

శ్రమ దోపిడీ చేస్తున్న పెట్టుబడిదారులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రమను పెట్టుబడిదారులు దోచుకునేందుకు వీలుగా ఎనిమిది గంటలు ఉన్న పనిదినాన్ని పది గంటలకు ప్రభుత్వం పెంచిందని ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం ఆరోపించారు. ఆదివారం స్థానిక గాంధీనగర్‌లోని మూడు బొమ్మల వద్ద ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వరప్రసాద్, పంది రంగయ్య, సుబ్బారావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, చరణ్‌తేజ పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాను అందరూ ఆచరించాలి ● మంత్రి డాక్టర్ స్వామి

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపు ● పాకలలో జరిగిన కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, జేసీ, ఎస్పీ



మాట్లాడుతున్న మంత్రి స్వామి



యోగా సాధన చేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ

సింగరాయకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, అందుకు భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాను అందరం ఆచరించాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం మండలంలోని పాకల బీచ్‌లో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా గురువు పతంజలి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. అనంతరం స్వామి మాట్లాడుతూ యోగాను రోజువారీ వ్యాయామంలో భాగంగా చేసుకోవడం వలన శారీరక ఉల్లాసం, మానసిక ప్రశాంతతా, ఏకాగ్రత పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. వన్ ఇయర్.. వన్ హెల్త్ పేరుతో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటారన్నారు. ఆరోజున రాష్ట్రవ్యాప్తంగా 2కోట్ల మంది ప్రజలు యోగాలో పాల్గొనేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. 25వేల మంది పిల్లలు 125 సూర్య నమస్కారాలు చేయబోతున్నారన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 9.60 లక్షల మంది యోగాంధ్ర యాప్‌లో నమోదయ్యారని తెలిపారు. ఎస్పీ దామోదర్, జేసీ గోపాల్‌కృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆయుష్ ఆర్‌డీడీ పద్మావతి, పశుసంవర్ధకశాఖ డీడీ రవికుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ శ్రీహరి, డీపీవో వెంటకనాయుడు, తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి పాల్గొన్నారు.

మోదీ పాలనలో ఆర్థికశక్తిగా భారత్

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



ఎమ్మెల్యే బీఎన్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన 11 సంవత్సరాల పాలనా కాలంలో దేశాన్ని ఆర్థికశక్తిగా అభివృద్ధి చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులో వికసభ భారత సంకల్పం కార్యక్రమాన్ని స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామయ్య అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో పేదరికాన్ని రూపుమాపేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, మరోవైపు భారతీయ సైనిక సంపత్తిని మెరుగుపర్చేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారన్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా అభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. అనంతరం యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దామోదర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మాకినేని అమరసింహం, పలువు రు నాయకులు పాల్గొన్నారు.

వికసిత్‌భారత్ ఎన్డీఏ లక్ష్యం

నాగులుప్పలపాడు : వికసిత్‌భారత్ ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం నాగులుప్పలపాడులో నిర్వహించిన సమావేశంలో ఆయన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను బీజేపీ నాయకులతో కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు పొదా అపర్ణ, వరప్రసాదరావు, నియోజకవర్గ అధ్యక్షుడు కల్యాణ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బండారు రామాంజనేయులు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు మురళీమోహన్, ఉపాధ్యక్షుడు అంజి పాల్గొన్నారు.

సంతనూతలపాడు: ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతనూతలపాడులో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గూండా శ్రీనివాసరావు, రాంబాబు, ఆనంద్‌కుమార్, కోటిరెడ్డి, మహేంద్ర, శేషయ్య పాల్గొన్నారు.

నగరంలో వర్షం.. రోడ్లు జలమయం



కొప్పోలురోడ్డులో కురుస్తున్న వర్షం

ఒంగోలు(రూరల్), జూన్15(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పలు రహదారులు జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అలాగే కొప్పోలు రోడ్డులో భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనాదారుల రాకపోకలకు అవస్థలు తప్పలేదు. రోడ్డుపై నీరు నిలువకుండా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని పరిసర వాసులు కోరుతున్నారు. పలు శివారు కాలనీల్లో నీరు నిలిచి ఇబ్బందుపడ్డారు.

104 సిబ్బందికి పెండింగ్ జీతాలను చెల్లించాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 104 సర్వీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. గతంలో అరబిందో యాజమాన్యం 104ను నిర్వహిచిందని, ఆ సంస్థ రెండు నెలల వేతనాలను ఉద్యోగులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఆదివారం ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సుబ్బారావు మాట్లాడుతూ 104 సర్వీసు ఉద్యోగులకు రావాల్సిన వేతనాలు, ఇతర బకాయిలను కూడా చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం 104 సర్వీసులను నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్‌ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతినెల వేతనాలు చెల్లించాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగిలిన స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి ఫ్లైఓవర్‌పై మోటార్ సైకిల్ అదుపుతప్పి మహిళకు గాయాలయ్యాయి. మార్టూరుకు చెందిన పి.రమాదేవి తన స్కూటీపై ఒంగోలు నుంచి మార్టూరు వెళ్తుండగా ఒక్కసారిగా లారీ రావడంతో అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో ఆమెకు గాయాలు కాగా మేదరమెట్ల వైద్యశాలకు తరలించారు.

సంక్షేమ పథకాలను అమలు చేయాలి

● సీఐటీయూ నేత ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : స్కీం వర్కర్లు, మునిసిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్కీం వర్కర్లు, పారిశుధ్య కార్మికులు ప్రభుత్వం నుంచి వేతనం తీసుకుంటున్నారనే కారణం చూపి సంక్షేమ పథకాలను నిలిపివేయడం దారుణంగా ఉందన్నారు. అతి తక్కువ వేతనాలు పొందుతున్న ఆశావర్కర్లకు సంక్షేమ పథకాలు కోత పెట్టడం సిగ్గుచేటని చెప్పారు. ఆరేళ్ల క్రితం నిర్ణయించిన ఆదాయ పరిమితినే నేటికి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కార్మికులందరికీ ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ స్కీం వర్కర్లకు కనీస వేతనాలు పెంచకుండా, ఉన్న సంక్షేమ పథకాలకు అనర్హులుగా చేయడాన్ని ఖండించారు. సమావేశంలో జీవీ.కొండారెడ్డి, జి.శ్రీనివాసులు, చీకటి శ్రీనివాసరావు, పి.కల్పన, టి.రంగారావు, సుబ్బారావు, రాము, మహేష్, కేశవరరావు, ఆవులయ్య, అంజనేయులు, పారా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మతల్లి కొలుపులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామంలో ఆదివారం గంగమ్మ తల్లి కొలుపులు వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా మొలకలపల్లి, చుండూరి, పాటిబండ్ల కుటుంబీకులు ఈ వేడుకలను ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మద్దినేని హరిబాబు, నువ్వుల మీరయ్య, రావులపల్లి సురేష్‌బాబు, అబ్బూరి శ్రీను, కొంకా చెన్నారావు, పాటిబండ్ల రాము, సుబ్బారెడ్డి, శేషయ్య, కొండలరావు, రామక్రిష్ణారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కూచిపూడి నృత్య శిక్షణ



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఒంగోలు కల్చరల్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీనళినీప్రియ కూచిపూడి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో గత 45 రోజుల నుంచి నిర్వహించిన కూచిపూడి ప్రవేశిక వేసవి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఒంగోలు నగరం సంతపేట సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సంస్థ ప్రిన్సిపాల్ ఎస్‌వీ.శివకుమారి విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల వ్యక్తిత్వ వికాసానికి, వారిలో కళల పట్ల ఆసక్తిని పెంపొందించేందు ఈ శిక్షణ ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సాయిబాబా మందిర ఛైర్మన్ అళహరి చెంచల రావు, పొన్నూరి వేంకటశ్రీనివాసులు, కృష్ణవేణి, ఎక్కిరాల ద్వారకానాథ్, జ్ఞానేశ్వర్‌లు పాల్గొని చిన్నారులను అభినందించారు.

టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌పై ఫిర్యాదులకు అవకాశం : డీఈవో

ఒంగోలు(విద్య), జూన్15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌పై ఏమైనా ఫిర్యాదులు ఉంటే జిల్లాస్థాయి కమిటీ లేదా డీఈవోకు ఇవ్వాలని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో కోరారు. డీఈవో ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీలు చేయదలిస్తే రీజనల్ స్థాయి కమిటీకి, ఆర్జేడీకి, అలాగే ఆర్జేడీ ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీలు చేయదలిస్తే రాష్ట్రస్థాయి కమిటీ అయిన పాఠశాల విద్యా కమిషనర్‌కు అప్పీలు చేయాలని ఆయన సూచించారు. అన్ని స్థాయిలలో ముందుగా అప్పీలు చేసి పరిష్కారం కోసం ప్రయత్నం చేయకుండా ఇతర చట్టపరమైన పరిష్కారాల కోసం వెళితే సంబంధిత ఉపాధ్యాయులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు

ఘనంగా భక్తి సంకీర్తనల సీడీ ఆవిష్కరణ



సీడీని ఆవిష్కరిస్తున్న అతిథులు


ఒంగోలు కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వర్ధమాన గాయకుడు, రచయిత గజ్జలకొండ బాలు రచించి గానం చేసిన భక్తిరస సంకీర్తనల ఆడియో సీడీ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక కర్నూల్‌రోడ్‌లోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవస్థాన శాశ్వత ధర్మకర్త పేలప్రోలు రామకృష్ణ పరమహంస సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రరసం జిల్లా అధ్యక్షుడు పొన్నూరి వేంకటశ్రీనివాసులు మాట్లాడుతూ భగవంతుని పట్టుకోవాలంటే భక్తికి మించిన మార్గం మరొకటి లేదన్నారు. ఒంగోలు ఏఎంసీ మాజీ ఛైర్మన్ మారెళ్ల వివేకానంద మాట్లాడుతూ సీడీలో పొందుపరచిన 12 భక్తిగీతాలు అందరూ పాడుకునే విధంగా అద్భుతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కొమ్మి కిష్టయ్య, పెనుబోతు భాస్కరరావు, మారెళ్ల సుబ్బారావు, ఇంకొల్లు మధుసూధనాచార్యులు, ఆకుల శ్రీను పాల్గొన్నారు. గాయకుడు బాలును వారు ఘనంగా సత్కరించారు.

పద్మశాలీ విద్యార్థులకు బహుమతులు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకవర్తపు ఆదిలక్ష్మమ్మ మార్కండేయ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంట ర్మీడియట్ పరీక్షలలో ఉత్తీర్ణులైన పద్మశాలి విద్యార్థులకు నగదు బహుమతులు అందించనున్నట్లు సొసైటీ నిర్వాహకులు కవర్తపు బాలకృష్ణారావు తెలిపారు. సంస్థ 22వ వార్షికోత్సవం సందర్భంగా ఈ బహుమతులు అందజేస్తామన్నారు. వార్షికోత్సవ కరపత్రాన్ని స్థానిక రాంనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పది, ఇంటర్ చదివిన పద్మశాలీ విద్యార్థులు తమ దరఖాస్తులను, పాస్‌పోర్ట్ ఫొటోతో ఈ నెల 28వ తేదీలోపు కవర్తపు బాలకృష్ణారావు, డోర్.నెం.37-1-10, 2వ లైన్, రాంనగర్, ఒంగోలు చిరునామాకు పంపించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9848433993 సెల్ నెంబరులో సంప్రదించాలన్నారు.



ఉద్యాన పంటల వైపు రైతుల చూపు

వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయంగా పండ్ల తోటల సాగు
తక్కువ పెట్టుబడులు - అధికంగా ప్రభుత్వ రాయితీలు
అందిపుచ్చుకుంటున్న అన్నదాతలు

కవలకుంట్లలో సాగులో ఉన్న బత్తాయి (ఇన్‌సెట్లో) పుల్లలచెరువులో సాగు చేసిన బొప్పాయి తోట

నిన్నటివరకు వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపిన రైతులు ఇప్పుడు ఉద్యానపంటల వైపు దృష్టిసారిస్తున్నారు. పత్తి, మిర్చి, తదితర పంటలతో పాటు పొగాకు సాగుకు పెట్టుబడులు అధికంగా పెట్టి సరైన ఆదాయం రాక నష్టాలను చవిచూశారు. ఇప్పుడు తక్కువ పెట్టుబడులు, శ్రమ తక్కువతో ప్రభుత్వం ఇచ్చే రాయితీలు అందిపుచ్చుకొని ఉద్యాన పంటలను సాగు చేయటానికి ఆసక్తి చూపుతున్నారు.



ఎర్రగొండపాలెంలో నాటిన అరటి మొక్కలు

త్రిపురాంతకం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని త్రిపురాంతకం మండలంలో సాగర్‌నీరు ఉండటంతో అక్కడ వరిపంట సాగుకు పోగా మిగిలిన రైతులు వాణిజ్య పంటలతో పాటు కొందరు నిమ్మ, బొప్పాయి తోటలను సాగు చేస్తున్నారు. మిగిలిన ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో అధికంగా ఇప్పుడు ఉద్యానపంటల సాగుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. ఈ మండలాల్లో అరటి, బొప్పాయి, నిమ్మ పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఉద్యానపంటలకు ప్రభుత్వం కూడా రాయితీలు అధికంగా ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తుండటంతో వాటిని అందిపుచ్చుకొని రైతులు సాగు విస్తీర్ణం పెంచుతున్నారు. పండ్లతోటలే కాకుండా ప్రభుత్వం పూలమొక్కలు, హైబ్రిడ్ కూరగాయల సాగుకు కూడా రాయితీలను అందిస్తుందని, వాటిని కూడా రైతులు తెలుసుకొని సాగు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు మొదట భూసార, నీటి పరీక్ష కూడా చేయించి ఆయా ప్రాంతాలకు అనువైన పండ్ల మొక్కలను ఎంపిక చేసుకొని నాటుకోవాలని చెబుతున్నారు.

ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వ రాయితీలు ఇలా

ప్రభుత్వం అందించే రాయితీలు నిబంధనలు ఇలా ఉన్నాయి. ఒక రైతుకు 5 ఎకరాలకు మాత్రమే అత్యధికంగా రాయితీ ఇస్తారు. 5 ఎకరాలకు మించి భూమి ఉన్న పెద్దరైతు కూడా పథకానికి అర్హులే అయినప్పటికీ 5 ఎకరాలకు మాత్రమే రాయితీ వర్తిస్తుంది. నీటివసతి ఉండి బిందు సేద్యం ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు. రైతుకు అయ్యే ఖర్చులో 40శాతం సబ్సిడీగా ఇస్తారు. అందులో 60 శాతం మొదటి ఏడాది, మిగిలిన 40 శాతం రెండో ఏడాది నేరుగా రైతుల ఖాతాకు జమ చేస్తారు. రెండో ఏడాది రాయితీ రావటానికి రైతులు నాటుకున్న మొక్కల్లో 80 శాతం బతికి ఉండాలి.

ఎర్రగొండపాలెం సబ్‌డివిజన్ పరిధిలో అరటి గతంలో 50 నుంచి 100 హెక్టార్లు లోపు సాగు చేయగా ఈ ఏడాది 300 హెక్టార్లు సాగు కావచ్చని అంచనా. బొప్పాయి గతంలో 300 హెక్టార్లు ఉండగా ఈ ఏడాది దాదాపు 700 హెక్టార్లు సాగు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిమ్మ , బత్తాయి సాగును గతంలో కన్నా మరో 50 శాతం పెంచేలా రైతులకు వివరిస్తున్నామని అధికారులు తెలియజేస్తున్నారు.

సబ్సిడీ కోసం రైతులు అధికారులకు ఇవ్వాల్సిన ధ్రువపత్రాలు

- దరఖాస్తుతో పాటు రైతులు ఉద్యానశాఖ అధికారులకు వీటిని సమర్పించాల్సి ఉంటుంది.
- రైతు పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీ
- 1బీ నకలు లేటెస్ట్ కాపీ
- ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ
- బ్యాంకు ఖాతా పాస్‌బుక్ కాపీ
- రైతు పాస్‌పోర్టు ఫొటో
- మొక్కలు కొనుగోలు చేసిన బిల్లు

పూలతోటలకు..

హైబ్రిడ్ కూరగాయలకు ఎకరాకు 9,600 రూపాయలు, పూలతోటలైన బంతి, చామంతి, మల్లె మొక్కలకు ఎకరాకు 8,000 రూపాయలు చొప్పున రాయితీ అందించనున్నారు.

వివిధ పండ్ల మొక్కలకు ప్రభుత్వం అందించే రాయితీ మొత్తం వివరాలు

పంట	మొక్కమధ్య దూరం	ఎకరాకు ఎన్ని	మొదటి ఏడాది	రెండో ఏడాది	మొత్తం
మామిడి	7.5-7.5మీ	72	12,000/-	8,000/-	20,000/-
మామిడి	5-5 మీ	160	19,200/-	12,800/-	32,000/-
మామిడి	3-2 మీ	670	28,800/-	19,200/-	48,000/-
జామ	3-3 మీ	44	19,200/-	12,800/-	32,000/-
బత్తాయి	6-6 మీ	111	12,000/-	8,000/-	20,000/-
సపోటా	5-5 మీ	160	14,400/-	9,600/-	24,000/-
అరటి	1.8-1.8 మీ	123	16,800/-	11,200/-	28,000/-
బొప్పాయి	1.8-1.8 మీ	1,235	7,200/-	4,800/-	12,000/-
సీతాఫలం	4-4 మీ	250	7,200/-	4,800/-	12,000/-
ఉసిరి	6-6 మీ	111	7,200/-	4,800/-	12,000/-

ప్రభుత్వ రాయితీలతో రైతులకు మేలు



ఉద్యాన పంటలు సాగు చేయాలనుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. దీనిని రెండేళ్ల పాటు అందజేస్తుంది. రైతులు నాణ్యమైన మంచి గుర్తింపు ఉన్న నర్సరీల్లో మొక్కలను తెచ్చుకోవాలి. భూసార పరీక్షతో యాజమాన్య పద్ధతులు తెలుసుకొని తగినంత మోతాదులో ఎరువుల వాడకం చేపడితే మంచి లాభాలు ఆర్జించవచ్చు. ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

- ఆదిరెడ్డి, ఉద్యానశాఖ అధికారి, ఎర్రగొండపాలెం



కార్యక్రమానికి హాజరైన పీవీఆర్‌ఎం స్కూలు పూర్వ విద్యార్థులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న నిర్వాహక కమిటీ ప్రతినిధి వీరప్రతాప్

ఘనంగా పీవీఆర్‌ఎం పూర్వ విద్యార్థుల కలయిక

వచ్చే సంక్రాంతికి పెద్దఎత్తున శతాబ్ది ఉత్సవం నిర్వహణకు నిర్ణయం

ఒంగోలు కల్చరల్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పీవీఆర్ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం స్థానిక కోర్టుసెంటర్‌లోని పీవీఆర్ మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి పాఠశాలలో వివిధ సంవత్సరాలలో చదువుకున్న వారు హాజరై నాటి తమ స్నేహితులను ఆప్యాయంగా పలకరిస్తూ ఆనందంగా గడిపారు. పాఠశాలలో చదివి ఒంగోలు నగరంలోనే కాకుండా అనేక ప్రాంతాలలో ఉద్యోగ, వ్యాపార, వివిధ వృత్తుల రీత్యా స్థిరపడిన అనేకమంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ ప్రతినిధి ఆరిగ వీరప్రతాప్ మాట్లాడుతూ పాఠశాలలో గతంలో చదివిన సుమారు 5 వేల మందితో సంక్రాంతి పండుగ సెలవులలో శతాబ్ది ఉత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు గాను వివిధ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో చదివి దేశ విదేశాలలో ఉన్న వారి సమాచారాన్ని సైతం సేకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో గడియారం సుబ్బయ్య శర్మ, బి.సూర్యప్రకాశరావు, బొమ్మిశెట్టి కిషోర్, డాక్టర్ నల్లమల్లి సురేష్, కొల్లిపల్లి సురేష్, తాతా బదరీనాథ్, తాతా ప్రసాద్, బోడపాటి సుబ్బారావు, ఈదర సురేష్‌బాబు, చిట్టెం శ్రీనివాసరావు, ధారా శ్రీవల్లి, సువర్చల, కల్యాణి, రాజ్యలక్ష్మి, పెద్దసంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటోల ఎగ్జిబిషన్‌ను అందరూ ఆసక్తిగా తిలకించారు.

అర్జీదారులు 1100 నెంబర్‌ను వినియోగించుకోవాలి:కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు డయల్ 1100 నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కాల్‌సెంటర్ 1100ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కాల్‌సెంటర్ ద్వారా సమస్యలను ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకొనేందుకు అవకాశం కల్పించిందన్నారు. తమ సమస్యలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి సంబంధిత అధికారికి ఆ సమస్యను పంపి తద్వారా పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్జీదారుని మొబైల్ నెంబర్‌కు ఎస్‌ఎంఎస్ ద్వారా నిర్ధారణ సమాచారాన్ని కూడా పంపడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు తమ అర్జీ స్థితి/సమాచారాన్ని కూడా 1100లకు కాల్‌చేసి తెలుసుకొనే అవకాశం కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు. జిల్లాలోని ప్రజలందరూ కాల్‌సెంటర్ ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఎస్‌వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు

భారత్ విద్యా విభూషణ్ పురస్కార్



డాక్టర్ ఆర్.పోలిరెడ్డి

గిద్దలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న డాక్టర్ ఆర్.పోలిరెడ్డికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భారత్ విద్యా విభూషణ్ పురస్కార్ అవార్డు లభించింది. ఈ అవార్డును ఆయన హయ్యర్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ అయిన ప్రొఫెసర్ సి.కృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. ఆంగ్ల సాహిత్య పరిశోధనలో చూపిన విశిష్ట ప్రతిభకు, ఉన్నత విద్య, ఆధ్యాత్మిక రంగాలలో చేస్తున్న కృషికి ఈ అవార్డు లభించింది. చెన్నైలోని ఇంటర్నేషనల్ అమెరికన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సంస్థ డాక్టర్ పోలిరెడ్డికి భారత్ విద్యా విభూషణ్ పురస్కార్‌ను అందజేశారు. గతంలో కూడా డాక్టర్ పోలిరెడ్డి మహాత్మాగాంధీ జాతీయ శాంతి అవార్డు, సాహిత్య రత్న అవార్డు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు, ఎన్టీఆర్ ఎక్స్‌లెంట్ అవార్డు, విద్యారత్న అవార్డులను వివిధ సంస్థల నుంచి అందుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ అవార్డులతో ఎస్‌వీ కళాశాలకు, గిద్దలూరుకు మంచి పేరు సాధించి పెడుతున్న డాక్టర్ పోలిరెడ్డిని కళాశాల కరస్పాండెంట్, మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పన, కళాశాల కార్యదర్శి పిడతల అభిషేక్‌రెడ్డి, లెక్చరర్లు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

లక్ష్మీనరసింహుడికి చక్రస్నానం

- శాస్త్రోక్తంగా ధ్వజావరోహణ

సింగరాయకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో పదో రోజైన ఆదివారం స్వామి వారికి చక్రస్నానాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలంకరణ గావించి శాస్త్రోక్తంగా పూజక్రతువును ముగించారు. అనంతరం వరాహ లక్ష్మీనరసింహుడికి తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలను ముందుండి జరిపించినందుకు సుదర్శన చక్రాన్ని విశేషంగా అభిషేకించారు. రాత్రికి పూర్ణాహుతిని నిర్వహించి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు ధ్వజస్తంభంపై ఎగురవేసిన గరుడ పటాన్ని ధ్వజావరోహణ గావించారు. ఈ సందర్భంగా గరుడ ప్రసాదాన్ని స్వీకరించి తొమ్మిది రోజులు దీక్షబూనిన సంతానం లేని మహిళలకు ధ్వజావరోహణ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో పి. కృష్ణవేణి, అర్చకులు ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు, సుదర్శనాచార్యులు, రికార్డు అసిస్టెంట్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.



వరాహ లక్ష్మీనరసింహుడికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు

పాలిటెక్నిక్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

21నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
25 నుంచి వెబ్ ఆప్షన్లు
జూలై 3 నుంచి సీట్ల కేటాయింపు

ఒంగోలు విద్య, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహించిన పాలిసెట్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను రాష్ట్ర సాంకేతిక విద్యా డైరెక్టర్ విడుదల చేశారు.

వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రత్యేకంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో హెల్ప్‌లైన్‌సెంటర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఒంగోలు, కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. సర్టిఫికెట్ల పరిశీలనకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాల్సి ఉంది. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ. 700, ఎస్సీఎస్టీ అభ్యర్థులు రూ. 250 చెల్లించాలి.సర్టిఫికెట్ల పరిశీలనకు పాలిసెట్ ర్యాంకు కార్డు, పదవ తరగతి తత్సమాన విద్యార్హతలకు సంబంధించిన ఒరిజనల్ లేదా ఇంటర్నెట్ సర్టిఫికెట్, 4నుంచి10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా ఏడు సంవత్సరాల రెసిడెన్సీసర్టిఫికెట్, 2022 జనవరి 1 తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రాలను, రిజర్వుడు కేటగిరి అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రాలతో సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలి.

సర్టిఫికెట్ల పరిశీలన ఇలా..

పాలిసెట్ అడ్మిషన్లకు ఎంపిక చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో ఈనెల 21నుంచి 28 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. 21న మొదటి రోజు 1వ ర్యాంకు నుంచి 15వేల ర్యాంకు, 22న 15,001నుంచి 32వేల ర్యాంకు వరకు, 23న 32,001నుంచి 50వేల లోపు ర్యాంకులు, 24న 50,001నుంచి 68వేల ర్యాంకు వరకు, 25న 68,001 నుంచి 86వేల ర్యాంకు, 26న 86,001నుంచి 1,04,000 ర్యాంకు వరకు, 27న 1,04,001 నుంచి 1,20,000 ర్యాంకు వరకు, 28న 1,20,002 నుంచి అందరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. కోర్సుల్లో చేరేందుకు ఈనెల 25నుంచి వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. జూలై 3న అభ్యర్థులకు సీట్లు కేటాయింపు జరుగుతుంది.

పర్యాటకుల అప్రమత్తానికే బే వాచ్ టవర్

మంత్రి డాక్టర్ స్వామి
పాకల తీరంలో కలెక్టర్, ఎస్పీలతో కలిసి ప్రారంభం

సింగరాయకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పాకల సముద్ర తీరానికి వచ్చిన ప్రతి పర్యాటకుడినీ సురక్షితంగా ఇంటికి వెళ్లేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. అందులో భాగంగానే తీరం ఒడ్డున పర్యాటకులను అప్రమత్తం చేయడానికి రూ.15 లక్షలతో బే వాచ్ టవర్‌ను నిర్మించామన్నారు. ఆదివారం మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్, జేసీ గోపాల్‌కృష్ణలు నూతనంగా నిర్మించిన వాచ్ టవర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ పాకల బీచ్‌లో గతంలో జరిగిన కొన్ని ప్రమాదాల్లో కొంతమంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆ సంఘటనలు తీవ్రంగా తనను కలిచివేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి దుర్ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండటానికి నూతన ఆలోచనలతో తీరప్రాంతాల్లో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ బే వాచ్ టవర్‌ను నిర్మించినట్లు చెప్పారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పాకల బీచ్ జిల్లాలో ఒక ప్రముఖ పర్యాటక కేంద్రమని, ఇలాంటి ప్రదేశాల్లో పర్యాటకుల భద్రతా పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ బే వాచ్ టవర్ నిర్మాణంలో అత్యాధునికమైన సీసీ కెమెరాలు, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం, టైం క్లాక్ అనౌన్స్‌సిస్టం ఏర్పాటు చేసినందుకు సీఐ చావా హాజరత్తయ్య, ఎస్సై బి. మహేంద్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సైకం చంద్రశేఖర్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, మెరైన్ సీఐ శివన్నారాయణ, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్సై నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



బే వాచ్ టవర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా, మంత్రి స్వామి, ఎస్పీ దామోదర్, పక్కన పాకలలో నిర్మించిన బేవాచ్ టవర్



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస ప్రసాద్

శ్రీనివాసప్రసాద్‌కు అవార్డు

కంభం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): 32 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పులి శ్రీనివాసప్రసాద్‌కు జాతీయ సాక్షరతా సమితి వారు కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో వరల్డ్ ఇన్‌ఫ్లూఎన్సర్ అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం కోల్‌కతాలోని చిత్రంగడ ఆడిటోరియంలో వివిధ రంగాలలో విశేష అనుభవం గడించిన రెండు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వ్యక్తులను ఎంపిక చేసి అవార్డులతో సత్కరించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్, సత్యజిత్ భట్టాచార్య, భారత చిత్ర నిర్మాణ సంస్థ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సవ్యసాచి ఈ అవార్డును అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథుడు

గజవాహనంపై తిరుమలనాథుడు

పెద్దారవీడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజంపల్లిపై వెలసిన గొడ్రాలికొండ తిరుమలనాథస్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవేరులతో కూడిన తిరుమలనాథుని ఆదివారం గజ వాహనంపై ఊరేగించారు. ఆలయ వేద పండితులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో పుష్పాలు, పట్టు వస్త్రాల స్వామివారి మూలవిరాట్, రాజేశ్వరి అమ్మవారు, ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ కుల సత్రాలవారు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు.

బిందు సేద్యం.. దిగుబడులు అధికం

నీటి ఆదా, శ్రమ, ఖర్చు తక్కువ

పెద్ద దోర్నాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తక్కువ సమయంలో మొక్కలకు ఎక్కువ సార్లు నీటిని అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు బిందు సేద్యం ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ పద్ధతి వల్ల నీటిని ఆదా చేయడంతో పాటు అధిక ప్రయోజనాలు పొందవచ్చు. బిందు సేద్యం అవలంబిస్తున్న రైతులు తక్కువ ఖర్చుతో పాటు మేలైన దిగబడులు సాధిస్తున్నారని పలు పరిశోధనలు నిరూపించాయి. రైతులు ఇప్పటివరకు ఉద్యాన పంటల్లో ఎక్కువగా డ్రిప్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఆరుతడి పైర్లకు బిందు సేద్యం అవలంబించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం డ్రిప్‌కు రాయితీ కూడా కల్పిస్తోంది. మోటారు పంపుసెట్ల నుంచి వచ్చే నీటిని నేరుగా గొట్టాల్లోకి పంపించి యిన్న చిన్న పైపుల ద్వారా ప్రతి మొక్కకూ నీరు పడేటట్లు అమర్చాలి. ఈ డ్రిప్పర్ల ద్వారా గంటకు 2 నుంచి 8 లీటర్ల వరకు మొక్కకు నీరు అందుతుంది. ఈ పద్ధతిలో ఎక్కువగా నేలపై అమర్చే విధానాన్ని అవలంబిస్తున్నారు. ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీటి మట్టం తగ్గి పోగా కొన్ని బోర్లలో కొద్దిపాటి నీరు వస్తోంది. ఈ నీటిని పైర్లకు అందించేందుకు డ్రిప్ పతద్ధతి ఎంతో మేలు. పత్తి, మిరప, జొన్న, కూరగాయలు, పూలు, మల్బరీ, చెరకు తదితర పంటలకు సన్నని పైపుల ద్వారానే పంటల అవసరాన్ని బట్టి నాటుకునే విధానాన్ని బట్టి 30 నుంచి 75సెంటీమీటర్ల దూరంలో రంధ్రాలు ఉండి నీటి చుక్కలు పడుతుంటాయి. నేల ఎత్తు పల్లాలు ఉన్నా మొక్క దగ్గర నీటి చుక్క పడే విధంగా డ్రిప్‌ను ఏర్పాటు చేస్తారు.

డ్రిప్ వినియోగంతో లాభాలు

డ్రిప్ పద్ధతిలో సాగు చేసే పంటలకు ప్రత్యేకంగా నీటి తడులు ఇవ్వాలసిన అవసరం ఉండదు. నీరు ఎక్కువ, తక్కువ కాకుండా డ్రిప్పర్ దగ్గర నీటి చుక్కలు సమానంగా పడతాయి. నేలకు అవసరమయ్యే తేమ అందుతుంది. కొలత ప్రకారం నీరు అందించవచ్చు. వినియోగించిన ప్రతి లీటరు నీటికి ఎక్కువ ఫల సాయం లభిస్తుంది. మామూలుగా ఎకరం సాగు చేసే నీటితో డ్రిప్ పద్ధతి ద్వారా రెండున్నర ఎకరాలు సాగు చేయవచ్చు. కలుపు మొక్కలను అదుపు చేయవచ్చు. విద్యుత్ కూడా ఆదా అవుతుంది. రసాయనిక ఎరువులు డ్రిప్ ద్వారానే ద్రవ రూపంలో అందించే అవకాశం ఉంది. తద్వారా ఎరువు ఖర్చు తగ్గుతుంది. కూలీల శ్రమ ఆదా అవుతుంది. సాధారణంగా 100కిలోల ఎరువు అవసరమైతే డ్రిప్ ద్వారా 50కిలోలు ఎరువు సరిపోతుంది.


డ్రిప్ పద్ధతిలో సాగులో ఉన్న పైరు

ప్రభుత్వ ప్రోత్సాహం

రైతులు బిందు సేద్యం చేసేందుకు ప్రభుత్వం రాయితీని ప్రకటించింది. గత టీడీపీ హయాంలో ఈ పథకం అమలులో ఉండగా, వైసీపీ దానిని రద్దు చేసింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్రిప్‌కు రాయితీని మంజూరు చేసింది. సన్న చిన్న కారు రైతులకు 90శాతం, 5ఎకరాలకు పైగా ఉన్న రైతులకు 70 శాతం రాయితీని ప్రకటించింది.

మెళకువలు పాటించాలి

డ్రిప్ పద్ధతి అవలంబించే రైతులు కొద్ది పాటి మెళకువలు తెలుసుకోవాలసిన అవసరం ఎంతైనా ఉంది. కాలువలు, చెరువుల నుంచి వచ్చే నీటిలో సన్నని మట్టి, ఇసుక రేణువులు ఎక్కువగా ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో నీటిలో లవణాలు అధికంగా ఉంటాయి. ఇవన్నీ డ్రిప్ పరికరాల్లో పేరుకుపోయి నీటి సరఫరాకు అవరోధం కల్గిస్తాయి. అందువల్ల ఫిల్టర్లను రైతులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లోని రైతులకు డ్రిప్ చాలా ఉపయోగపడుతుంది.


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో నేతలు

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నియోజకవర్గంలో 32 మందికి రూ.21.89లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

మార్కాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కందుల తండ్రి నారాయణరెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన టీడీపీ నాయకులతో కలిసి పాల్గన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 32 మందికి రూ.21.89 లక్షల మేర మంజూరైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు వైద్యం పొందిన పేదలు సకాలంలో దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలోనే ముఖ్యమంత్రి సహాయనిధి అందుతోందన్నారు. ప్రజలకు మెరుగైన పాలనను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఇబ్రహీంఖాన్, కార్యదర్శి రంగస్వామి, కౌన్సిలర్లు కొండయ్య పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే రైతులకు మేలు


మాట్లాడుతున్న ప్రసాద్

త్రిపురాంతకం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు, రైతులకు మేలు జరగాలంటే ఉద్యమాలే శరణ్యమని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం త్రిపురాంతకంలో జరిగిన సీపీఐ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఐ మండల కార్యదర్శి దాసరి మల్లికార్జున అధ్యక్షత జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల్లో నీరులేక బీడుభూములుగా పొలాలు ఉంటే త్రిపురాంతకం ప్రాంతంలో సాగర్ జలాలు రావడానికి అప్పట్లో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కోసం కమ్యునిస్ట్ పార్టీ చేసిన ఉద్యమాలే కారణమన్నారు. ఎన్నో ఏళ్ల ఉద్యమం చేస్తే ఈరోజు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతోందన్నారు. త్రిపురాంతకం మండలం మేడపి, ముడివేముల గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కోసం సీపీఐ చేసిన కృషిని గుర్తు చేశారు. ఆగస్టులో పార్టీ జిల్లా మహాసభలు ఒంగోలులో జరుగుతున్నాయని వాటిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, వైపాలెం కార్యదర్శి సాంబశివరావు, త్రిపురాంతకం సహాయ కార్యదర్శి తిరుమలయ్య, ఆదినారాయణ, పవన్‌కుమార్, కాశిం, పలుకూరి చిన్న రామయ్య, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

17న విద్యుత్ వినియోగదారుల సదస్సు

కంభం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కంభంలో ఈనెల 17వ తేదీ మంగళవారం మార్కాపురం డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కంభం విద్యుత్ సబ్ డివిజన్ ఏడీఈ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏడీ ఫంక్షన్ హాలులో విశ్రాంత న్యాయాధికారి ఎన్.విక్టర్ ఇమ్మానియేలు అధ్యక్షతన మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు, సందేహాలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సంబంధిత సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, సునీత, గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొంటారని, కావున వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

30వరకు క్రమబద్ధీకరణకు గడువు

పొదిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ మోహన్ రెడ్డి తెలిపారు. అదనపు లోడు క్రమబద్ధీకరణ కింద 50శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. వన్ కేవీ లోడ్‌కు రూ.2250కి గాను రూ.1220, టూ కేవీ లోడ్‌కు రూ.4450లకు రూ.2450, త్రీకేవీ లోడ్‌కు రూ.6650కి గాను రూ. 3650 కట్టాల్సి ఉందన్నారు. ప్రతి కిలోవాట్‌కు రూ.1000 చొప్పున రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. ఈనెల 30తేదీ వరకు మాత్రమే ఈ అవకాశం ఉందన్నారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకోవడం వలన ఆయా ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య, ఇతరత్రా సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని ఏఈ తెలిపారు.

చురుగ్గా యోగా

పొదిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పొదిలి జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీల ఆవరణలో కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. ఔత్సాహికులు పాల్గొని యోగా సాధన చేస్తున్నారు. ఆదివారం పొదిలి కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి యోగా సాధన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే వివిధ స్థాయిల్లో శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసి, వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు వివరించారు.

నేడు వ్యాసరచన పోటీలు

గిద్దలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయం ఆవరణలో 16వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం ప్రతినిధి శ్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులందరూ యోగాసనాలపై నిర్వహించే వ్యాసరచన పోటీలలో పాల్గొనవచ్చని, విజేతలకు బహుమతులు అందచేయడం జరుగుతుందని, వివరాలకు 7780122987 సంప్రదించాలన్నారు.

పట్టుదల ఉంటే లక్ష్యాలను చేరుకోవచ్చు

పొదిలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, పట్టుదల ఉంటే లక్ష్యాలను చేరుకోవచ్చని ఏఎంసీ చైర్మన్ సయ్యద్ ఇమాంసాహెబ్ పేర్కొన్నారు. కరాటే మాస్టర్ కఠారి చిన్నరాజు వద్ద శిక్షణ పొందుతున్న ఎనిమిదేళ్ల హన్వికకు ఆదివారం బ్లాక్ బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే 16 కరాటేను నేర్చుకొని బ్లాక్ బెల్ట్ సాధించిన జె హన్వికను అభినందించారు. బాలికలకు కరాటే దోహదపడుతుందన్నారు. అనంతరం హన్విక ఆత్మరక్షణకు ఉపయోగపడే వివిధ రకాల నైపుణ్యాలను ప్రదర్శించింది. కార్యక్రమంలో కరాటే మాస్టర్ కఠారి చిన్నరాజు, వీఆర్వో ఎస్ నారాయణ, ఈవో తిరుపతి, మస్తాన్‌వలి, ఆర్ఎంపీ వైద్యులు కఠారి భరత్, కోటయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పెద్దారవీడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తోకపల్లిలో గుర్తు తెలియన మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని అరుగు మీద గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారం అందచేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు ఉండవచ్చని, ఎత్తు 5-3 అడుగులు, గల్ల చొక్కా, బ్లూ ప్యాంట్ వేసుకొని ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మోదీ పాలనలో దేశాభివృద్ధి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కృష్ణారావు అన్నారు. బీజేపీ వికసిత్ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కృష్ణారావు మాట్లాడుతూ.. మోదీ పాలనలో భారత్ ప్రగతిశీల మార్గంలో ముందుకు వెళ్లిందన్నారు. ఏపీలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు కె.పిచ్చయ్య, బి.కృష్ణ, ఎం.చిన్నయ్య, ప్రవీణ్, శ్రీకాంత్, శివప్రసాద్, సుబ్బారావు, రామకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మృతదేహాలకు నివాళి


నివాళులర్పిస్తున్న కృష్ణకిశోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగళవీడు రోడ్డులోని ఎస్టీ కాలనీకి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఆదివారం టీడీపీ నేత ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి మృతదేహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. కృష్ణకిశోర్‌రెడ్డి కొంగళవీడులోని ఎస్టీ కాలనీకి వెళ్లి రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతిచెందిన జగన్నాథం చిన్న రంగయ్య (45), నందిని (18) మృతదేహాలకు నివాళులర్పించి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, టీడీపీ తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు షానేషావలి, టీడీపీ నాయకులు బిల్లా రమేష్, వేములపాటి చంటి, మేడం వెంకటస్వామి, రఫి, భాషా ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం అదుర్స్


గురువులతో పూర్వ విద్యార్థులు


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

- చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న పూర్వ విద్యార్థులు
- పాఠశాల అభివృద్ధికి సాయం

తర్లుపాడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 32 ఏళ్ల కిందట చదువుకున్న రోజుల్లో వారు చేసిన అల్లరి, ఆటపాటలు, స్నేహితులతో కలిసి ఆనందంగా పంచుకున్నారు. ఒకరినొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కాసేపు బాల్యంలోకి వెళ్లారు. కుటుంబ సభ్యుల స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం చదువు నేర్పిన గురువులు ఎంసీ కృష్ణారెడ్డి, జె.కృష్ణమూర్తి, జాని విలాసిని, ముసలయ్య తదితరులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తాము చుదువుకున్న పాఠశాల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ.. పాఠశాలలో ఇటీవల జరిగిన 75వ వసంత వేడుకలకు పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని చెప్పారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమం లో పాఠశాల ఎస్ ఎం సీ చైర్మన్ రాజారపు రామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు గోసు శ్రీనివాసులు, సీహెచ్ చెంచయ్య, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

బేస్తవారపేట : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. కందుల ఓబుల్‌రెడ్డి కళాశాలలో 1996-99 బ్యాచ్‌కి చెందిన డిగ్రీ పూర్వ విద్యార్థులు సుమారు 50 మంది ఒక చోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న రోజుల నుంచి ప్రస్తుత స్థితిగతులను ఒకరినొకరు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు కళాశాల డైరెక్టర్ కందుల ఓబుల్‌రెడ్డి, సోమశేఖర్, చేగిరెడ్డి సుబ్బారెడ్డి, శంకర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులును శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతి

గిద్దలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తల్లి లేక తండ్రి, అలాగే తల్లిదండ్రులు ఇరువురిని కోల్పోయిన, పూర్తి పేదరికంలో ఉన్న విద్యార్థులకు ఉచిత విద్య వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు పట్టణంలోని వీఆర్‌కాలనీలోని గల సంజీవని ఎడ్యుకేషనల్ గురుకుల స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఒ.రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. 4 నుంచి 10వ తరగతి వరకు 10 మందికి ఈ సౌకర్యం కల్పిస్తామన్నారు.

పశు వైద్యశాల సహాయ సంచాలకులు బదిలీ

గిద్దలూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని ప్రాంతీయ పశు వైద్యశాలలో సహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ యోగానంద ప్రసాద్ కంభం వైద్యశాలకు బదిలీ అయ్యారు. కంభం వైద్యశాలలో సహాయ సంచాలకులుగా పని చేస్తున్న డాక్టర్ ఆర్.బాలూనాయక్ గిద్దలూరుకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన డాక్టర్ యోగానంద ప్రసాద్‌ను బదిలీపై వచ్చిన డాక్టర్ ఆర్.బాలూనాయక్‌ను, అలాగే అనుమలవీడు ఆసుపత్రి నుంచి నెల్లూరుకు బదిలీ అయిన డాక్టర్ వి.సాయిచక్రవర్తిని పశువైద్యశాల సిబ్బంది, రైతులు ఘనంగా సన్మానించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : శివాజీ నగర్‌లో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరుని ఆలయంలో సప్తమ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం హనుమంత వాహనంపై వేంకటేశ్వరునికి నగరత్సోవం నిర్వహించారు. అర్చకులు అరుణ్ కుమార్‌చార్యుల ఆధ్వర్యంలో కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ, రాత్రి రథోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పాలెం చెంచయ్య, అధ్యక్షుడు టి.పి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం.కొండలరావు, అదనపు కార్యదర్శి నిట్టూరి రమేష్, కోశాధికారి వేముల పిచ్చిరావు, సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

అయ్యప్పకు విశేష అభిషేకాలు

పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప స్వామి 20వ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రెంటచింతల వెంకట వీరరాఘవ శర్మ ఆధ్వర్యంలో త్రిపురారి భట్ల దాసరథి అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు వివిధ రకాల అభిషేకాలను చేశారు. కుంకుమాభిషేకం, చందనాభిషేకం, పాలాభిషేకం, పసుపాభిషేకం, తేనె అభిషేకం, పెరుగాభిషేకం, పండ్ల రసాభిషేకం, పుష్పాభిషేకం, గణపతి హోమం, మహా కలశాభిషేకం, పూజ, భజన నిర్వహించి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. రాత్రి పులి వాహనంపై అయ్యప్ప స్వామికి పట్టణ వీధులలో నగరోత్సవాన్ని నిర్వహించారు. అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు తాడువాయి గోపాల మల్లికార్జునరావు, కార్యదర్శి పరుచూరి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు గుంటక వెంకటరెడ్డి, బొంత వెంకటేశ్వర్లు, టి.ఆదినారాయణ, కోశాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహోత్సవాలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బం డ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా రామస్వామి తిరునాళ్ల

రాచర్ల : నగర పంచాయతీ పరిధిలోని చర్లొడ్డిపల్లె గ్రామంలో శ్రీపట్టాభిరామస్వామి తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో రెండు రోజులుగా వైభవంగా స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి పాల్గొని పూజలు, అభిషేకం నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

మళ్లీ మొదటికొచ్చిన ట్రాఫిక్ సమస్య

- రోడ్లపైకి చేరిన ఫుట్‌పాత్ వ్యాపారం
- కనిగిరివాసులకు తప్పని ఇబ్బందులు
- అధికారులకు తలనొప్పిగా మారిన వైనం

కనిగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ఆక్రమణలు తొలగించి రోడ్ల విస్తరణకు శ్రీకారం చుట్టారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీరినంటేనే ప్రజలు ఆశించారు. అయితే, విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో మరలా వ్యాపారాలు రోడ్లపైకి చేరాయి.

గత పాలకులు కనిగిరి అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. ప్రధాన వీధుల్లోని భారీ డ్రైనేజీలు చెత్తా చెదారాలతో పూడుకుపోయాయి. దీంతో మురుగునీరు ముందుకు కదలడంలేదు. ఫలితంగా, వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి చేరుతుంది. తరచూ ఈ సమస్య తలెత్తుతున్నా పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు.

అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణాభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఎన్నికలకు ముందు పట్టణాభివృద్ధికి వచ్చిన నిధులతో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టింది. పట్టణంలో ప్రధాన రోడ్ల పక్కన ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, బంకులు తొలగించారు. దీంతో అప్పట్లో పట్టణంలో కలకలం రేగింది.

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం

ఆక్రమణల తొలగింపు తర్వాత రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంలో ఆలస్యమైంది. దీంతో ఫుట్‌పాత్ వ్యాపారులు ఒక్కొక్కరుగా చేరుకుంటున్నారు. పండ్ల దుకాణాల నుంచి వచ్చే చెత్తను కాల్వల్లో వేయటంతో చెత్తాచెదారాలతో నిండిపోయాయి. కొంతమంది డ్రైనేజీ కాలువలపై నాపరాళ్ళు వేసుకుని దుకాణాలు సాగిస్తున్నారు. ప్రధానంగా పామూరు బస్టాండు సెంటరులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతోపాటు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఒకరిని చూసి ఇంకొకరుగా ముందుకు వస్తుండటంతో తిరిగి ట్రాఫిక్ సమస్య మొదలైంది.


పామూరు బస్టాండు సెంటరు వద్ద ఫుట్‌పాత్ దాటి ముందుకువచ్చిన వ్యాపారాలు

తలనొప్పిగా మారిన వ్యాపారుల వైఖరి

పాలకులు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా వ్యాపారుల్లో మార్పురాకపోగా తిరిగి సమస్యను తెచ్చిపెడుతున్నారు. పామూరు బస్టాండు సెంటరులో ఉండే ఫుట్‌పాత్ వ్యాపారులతో పోలీసు సిబ్బందికి తలనొప్పిగా మారింది. ఎన్నిమార్లు హెచ్చరికలు చేసినా ఫలితం లేకుండా పోయిందని, రాజకీయ నాయకులతో సిఫార్సులు చేయిస్తూ తమ విధులకు ఆటకం కల్గిస్తున్నారంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా తొలగించిన ఆక్రమణల స్థానంలో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేయించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లు దాటివస్తే చర్యలు

- జోసఫ్ దానియేలు, మున్సిపల్ కమిషనర్



రోడ్డు విస్తరణ పనులు, భారీ డ్రైనేజీల పునరుద్ధరణకు డ్రైనేజీల్లోని పూడిక పనులు చేపట్టాం. ఆ సమయంలో ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించాం. రోజువారీ పనులు చేసుకుంటే తప్ప కుటుంబాలు గడవని స్థితిలో ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచనలు చేశారు. దీంతో వారి సూచనలతో తిరిగి ఫుట్‌పాత్ వ్యాపారులకు రోడ్డు ప్రక్కన ఉన్న ఫుట్‌పాత్‌లపైనే తోపుడుబండ్లు ఉంచుకుని వ్యాపారం చేసుకోవాలని సూచించాం. ఫుట్‌పాత్ దాటి మార్జిన్‌పైకి రాకూడదని, రాత్రికి తోపుడు బండ్లను ఇళ్లకు తీసుకెళ్లాలని ఆదేశించాం. అందుకు విరుద్ధంగా వ్యవహరించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

తీవ్రమైన ఆర్టీసీ బస్సుల కొరత

- ప్రయాణికుల అవస్థలు
- గత్యంతరంలేక ఆటోలను ఆశ్రయించాల్సిన దుస్థితి

దర్శి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రం కావటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు కొన్ని సందర్భాల్లో బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. అప్పుల్లో కూరుకుపోవటంతో కొత్త బస్సులు వేసిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంది. అత్యవసర రహదారుల్లో కొన్ని బస్సులను వేసినప్పటికీ ఇంకా అనేక మార్గాలకు బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జనాభా సంఖ్య విపరీతంగా పెరుగుతున్న సమయంలో అందుకనుగుణంగా బస్సుల సంఖ్య పెరగకపోవటంతో సమస్య తీవ్రమైంది. కొన్ని సందర్భాల్లో ఎంతసేపు వేచి ఉన్నా బస్సులు రాకపోవటంతో ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఆటోల నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా ఓవర్‌లోడ్‌తో వెళ్తూ అనేక సందర్భాల్లో ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని అధికారులు చెబుతున్నా అందుకనుగుణంగా చాలినన్ని బస్సులు లేకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దర్శిలో ఆర్టీసీ డిపో లేకపోవటంతో బస్సుల కోసం ఇతర డిపోలపై ఆధారపడాల్సి వస్తుంది. ఎన్నో ఏళ్లుగా నియోజకవర్గ కేంద్రమైన దర్శిలో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా కారణాలేమైనా బస్‌డిపో ఏర్పాటుకు నోచుకోలేదు. ప్రజల అవసరాలను గుర్తించి దర్శిలో బస్ డిపో ఏర్పాటుచేసి బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు.



దర్శి బస్ షెల్టర్ వద్ద ఆర్టీసీ బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు

ఆరోగ్య ఉపకేంద్రంలో పాముల నివాసం

- కాటుకు గురైన ఉద్యోగి
- మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలింపు

పామూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా ఉన్న హెల్త్‌క్లీనిక్ తలుపులు తెరిచి పరిశీలిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ జాస్మిన్ పాముకాటుకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని తూర్పుకట్టకిందపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. బీసీ కాలనీలో గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన హెల్త్ క్లీనిక్ నిరుపయోగంగా ఉంది. ఇటీవల ఆరోగ్యఉపకేంద్రానికి సంబంధించిన సెప్టిక్ ట్యాంకుపై మూత లేకపోవడంతో గేదె మృతి చెందింది. ఈక్రమంలో బొట్లగూడూరు పీహెచ్‌సీ డాక్టర్‌తో కలిసి రెండు రోజుల క్రితం గ్రామ టీడీపీ నాయకులు ఆప్రాంతాన్ని పరిశీలించారు. నిరుపయోగంగా పడిఉన్న హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించాలని కోరారు.


పిచ్చి మొక్కల మధ్య ఆరోగ్య ఉపకేంద్రం

ఈనేపథ్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజన ఆదేశాల మేరకు కేంద్రాన్ని ప్రారంభించేనిమిత్తం పరిశీలించేందుకు ఆదివారం సాయంత్రం ఎంఎల్‌హెచ్‌పీ జాస్మిన్, ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో కలిసి ఆప్రాంతానికి వెళ్లారు. హెల్త్‌క్లీనిక్ తలుపులు తీసి లోపలికి వెళ్లి పరిశీలిస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. దాంతో ఆమెను పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులకు డాక్టర్ రవళి ప్రియాంక సమాచారం అందించడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.


పామూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న జాస్మిన్

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో వేంచేసిన గ్రామ దేవత శ్రీపోలేరమ్మ అమ్మవారి మూడవ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా పోలేరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. తూర్పుకంభంపాడుతో పాటు నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, శంకరాపురంతో పాటు మండలంలోని పలుగ్రామాలు, సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు కడియాల లలిత్‌సాగర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలాగే, మండలంలోని వేంపాడు అంబేడ్కర్ కాలనీలో పోలేరమ్మ అమ్మవారి నెలపొంగళ్ళు వైభవంగా నిర్వహించారు. పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు.


తూర్పుకంభంపాడులో ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ


వేంపాడులో పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్లు పెడుతున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నారాయణ స్వామికి పూజలు

సీఎస్‌పురం(పామూరు) జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం లో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి మూలవిరాట్‌తో పాటు ఉత్సవమూర్తికి కుంకుమార్చన పూజలు, అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు మహానైవేద్యాన్ని ఆలయ గాలిగోపురం వద్ద నుంచి మేళతాళాలతో స్వామివార్లకు సమర్పించారు. అనంతరం గోసాలలోని గోవులకు పసుపు, కుంకుమలతో హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఆధ్వర్యంలో భక్తులకు అన్న దానం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో నరసింహబాబు, మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా సత్సంగం

కనిగిరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో ఆదివారం షిర్డి సాయిబాబా సత్సంగ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసందర్భగా బాబా కల్యాణమండపంలో శ్రీకర్లపూడి కృష్ణ ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు.

కార్యక్రమంలో మాజీమంత్రి ముక్కు కాశిరెడ్డి, సద్గురుసాయి సేవాసమితి అధ్యక్షుడు దేవకి సుబ్రమణ్యం, బాబా ఆలయ గౌరవాధ్యక్షుడు కుందురు తిరుపతిరెడ్డి, ఆలయ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, కార్యదర్శి బాలు ఓబులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నింటిని అమలుచేయాలి

ముండ్లమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మారెళ్ళ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది గడిచినా ఇంతవరకు ఒకటి రెండు తప్పా హామీలు అమలుచేయలేదన్నారు. అధికారం లోకి రాగానే పింఛన్‌లు పెంచి పంపిణీ చేయటం మంచి అంశమే అయినా మిగిలిన హామీలు నెరవేర్చలేదన్నారు.

కార్యక్రమంలో నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, మేకల హనుమంతరావు, హనుమయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ... తప్పిన ప్రమాదం

ముండ్లమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఆదివారం సాయంత్రం రెండు కార్లు ఢీకొన్నాయి. కార్లు దెబ్బతిన్నా అందులోఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. దర్శి వైపు నుంచి విజయవాడ వెళ్తున్న కారును, వెనుక నుంచి వస్తున్న మరో కారు ఢీకొట్టింది.

ఈప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. ముందు వెళ్తున్న కారులో మాత్రమే నలుగురు ఉన్నారు. వారికి ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శిగా నాగేంద్రచారి

పామూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శిగా పామూరుకు చెందిన నొస్సం నాగేంద్రచారి ఎన్నికయ్యారు. ఆదివారం ఒంగోలులో జరిగిన కార్యవర్గ సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రచారి, కోశాధికారిగా బ్రాహ్మణచారిలకు జిల్లా అధ్యక్షుడు పీఎస్ బాబురావు నియామక పత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో ప్రకాష్, కీనల శ్రీనివాస్, ముండ్లపాటి దొరసానయ్యచారి, బీవీ రమణాచారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలి

పామూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వచ్చేనెల 7న ప్రతి గ్రామంలో జెండాలను ఆవిష్కరించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేపీ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మోట్రావులపాడులో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణమాదిగ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు నరేంద్ర మాదిగ సారథ్యంలో జెండాలను ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏలియా, శేషంమోషే, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన గురుబ్రహ్మాచారి(ఫైల్)

దర్శి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని తూర్పువెంకటాపురం, గణేశ్వరపురం గ్రామాల మధ్య శనివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. దొనకొండ మండలం ఆరవల్లిపాడు గ్రామానికి చెందిన రామడుగు గురుబ్రహ్మాచారి(56) కార్పెంటర్, వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. తాళ్ళూరు మండలం గంగవరం గ్రామంలో గత కొద్దిరోజులుగా వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. శనివారం పనులు పూర్తిచేసుకొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో తూర్పువెంకటాపురం, గణేశ్వరపురం గ్రామాల మధ్యలో గుర్తుతెలియని జంతువు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో గురుబ్రహ్మాచారి తలకు తీవ్ర గాయాలపాలై స్పృహకోల్పోయాడు. సమాచారం అందడంతో ఘటనాస్థలానికి 108 సిబ్బంది వెళ్లి క్షతగాత్రుడిని దర్శి వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు తెలిపారు. ఎస్సై మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం హర్షణీయం

దొనకొండ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం హర్షణీయమని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెహమాన్, మండ్లా శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం దొనకొండలో వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీ మేరకు ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే ప్రతి విద్యార్థి తల్లుల ఖాతాల్లో రూ.13వేలు నగదు, పాఠశాలల అభివృద్ధికి రూ.2 వేలు జమ చేయటం జరిగిందన్నారు. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం దేశంలో మన రాష్ట్రంలోనే అమలుజరిగేలా చర్యలు చేపట్టిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

పొలం పనుల్లో రైతులు బిజీ బిజీ


ఎన్ఎన్‌పాలెం గ్రామంలో నాటుతున్న పత్తి విత్తనాలు

దొనకొండ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులకు రైతులు ఉపక్రమించారు. ఈ ఏడాది రైతులు పత్తి పంట వైపు దృష్టి సారించి విత్తనాలు సాటుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తున్నాయని అందుకే ముందుగానే విత్తనాలు నాటి సాగుకు శ్రీకారం చుట్టినట్లు రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు మరో రెండు, మూడు రోజులు వర్షాలు పడితే పత్తి సాగుకు ఢోకా ఉండదని రైతులు భావిస్తున్నారు.

మండలంలో దాదాపు 2400 హెక్టార్లల్లో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉంది. మరో పది రోజుల్లో కంది, ఆముదం, మిర్చి పంటలను దాదాపు 7600 హెక్టార్లల్లో సాగు జరుగుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

తెగిన విద్యుత్ తీగ.. త్రుటిలో తప్పిన ప్రమాదం

సీఎస్‌పురం(పామూరు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవిలంపాడులో ఆదివారం 11 కేవీ విద్యుత్ తీగ తెగి షేక్ మస్తానమ్మ ఇంటిపై పడింది. దీంతో పాక్షికంగా ఇల్లు దగ్ధమైంది. పలు ఇళ్లలో ఫ్యాన్‌లు, ఏసీలు, టీవీలు, కూలర్లు కాలిపోయాయి. సంఘటన జరిగిన వెంటనే తెలుగు యువత నాయకుడు షేక్ రజ్జబ్‌బాషా విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో సరఫరాను నిలిపివేశారు. దాంతో ప్రాణనష్టం తప్పింది. డీఈ ఉమాకాంత్ వెంటనే స్పందించి పామూరు ఏడీ కృష్ణారెడ్డిని ఆదేశించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను మారుస్తామని తెలిపారు. కోవిలంపాడు గ్రామానికి ఆర్‌డీఎస్ఎస్ స్కీంలోకి మార్చడానికి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.

పామూరులో వర్షం

- ఇళ్లలోకి చేరిన మురుగునీరు



ఇళ్లలోకి చేరిన మురుగునీరు

పామూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పామూరులో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు గాలితో కూడిన వర్షం కురిసింది. కాలువలపై ఉన్న ఆక్రమణలతో పాటు కాలువలను ఎక్స్‌కవేటర్ల ద్వారా ధ్వంసం చేశారు. దీంతో కాలువల్లో రాళ్లు అడ్డుపడి ఉండటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. కనిగిరి రోడ్డు మెయిన్ కాలువల్లో చెత్తచెదారంతోపాటు కాలువలు పగలకొట్టడంతో రాళ్లన్నీ అందులోనే ఉప్పారు. దీంతో మురుగునీరు ఇళ్లలోకి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్ద కాలువల్లోని అడ్డంకులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కులు చెల్లించుకున్న కార్యకర్తలు

పామూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఎన్నికకావడంతో కామేపల్లి పోలేరమ్మతల్లి దేవస్థానంలో యారవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఆదివారం టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా యావర శ్రీనివాసులుకు దేవస్థాన నిర్వాహకులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఇర్రి కోటిరెడ్డి, పాలపర్తి రమణయ్య, అంచూరి వెంకట్‌రెడ్డి, గోళ్ల వీరబాబు, ఓగూరి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత


పెదఉల్లగల్లులో మొక్కలు పంపిణీ చేస్తున్న పరిటాల సురేష్

ముండ్లమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని టీడీపీ లీగల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పరిటాల సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని పెద ఉల్లగల్లులో ఆయన మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సమృద్ధి వర్షాలు కురవాలంటే మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అంతరించిపోతున్న వృక్ష సంపదను కాపాడాల్సిన అవసరం మన అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వలేటి పేరయ్య, రమేష్, సాంబ, శ్రీను, సుబ్బారావు, జిల్లెలమూడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)

16-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	34	28
తెనాలి	34	28
నరసరావుపేట	34	27
బాపట్ల	36	28
రెంటచింతల	34	27
చీరాల	36	28

ఒకే గొడుగు కిందకు.. బ్యాంకు గ్యారెంటీలు

- ఏఎంసీలలో కొత్త లైసెన్సులకు సవరణ
- దాదాపు రెట్టింపు చేస్తూ ప్రభుత్వ నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్షకు పెంపు
- పంట ఉత్పత్తులన్నీ ఒకే కేటగిరిలోకి తెచ్చిన మార్కెటింగ్ శాఖ

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఇక నుంచి కొత్త లైసెన్సులు పొందాలంటే బ్యాంక్ గ్యారెంటీలు ఎక్కువ మొత్తంలో నివేదించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న వాటిని రెట్టింపు చేస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ఏఎంసీలకు చేరాయి. గతంలో పండ్లు, కూరగాయలకు కలిపి ఒకే కేటగిరి చార్జీలు ఉండేవి. అలానే ఇతర పంట ఉత్పత్తులకు బ్యాంకు గ్యారెంటీలు ఎక్కువ మొత్తంలో ఉండేవి. ఇప్పుడు కూరగాయలు, పండ్లు ఇతర పంట ఉత్పత్తులు అన్న వ్యత్యాసం లేకుండా అన్నింటినీ ఒకే కేటగిరి కిందకు తీసుకొచ్చి బ్యాంకు గ్యారెంటీలను ప్రభుత్వం సవరించింది. దీని వల్ల రేపటి రోజున లైసెన్సుదారు మోసానికి పాల్పడినా బ్యాంకు గ్యారెంటీని సీజ్ చేసి, రైతులకు నష్టపరిహారం చెల్లించేందుకు సంబంధిత ఏఎంసీలకు వెసులుబాటు కలుగుతుంది.

కొత్తగా బ్యాంకు గ్యారెంటీలు ఇలా..

ఏఎంసీలలో చివరిసారిగా 2000 నవంబరులో బ్యాంకు గ్యారెంటీలను జీవో నంబరు 85 ద్వారా అప్పటి ప్రభుత్వం సవరించింది. వాటిని ఇప్పుడు పునఃసమీక్షించి సవరణలు చేస్తూ జీవో నంబరు 21 అమలులోకి తీసుకొచ్చింది. గతంలో కూరగాయలు, పండ్లకు టర్నోవర్ రూ.కోటి లోపు ఉంటే రూ.50 వేలు, రూ.కోటి నుంచి (మిగతా 6వ పేజీలో)

చినుకు రాలదాయె!

- 59 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- పంటల సాగు తడబాటు
- తొలకరి కోసం రైతుల ఎదురు చూపులు
- సాగుకు సిద్ధం చేసిన భూములు
- ఆందోళనలో అన్నదాతలు

మూడు జిల్లాల్లో పంటల సాగు ఇలా..

మూడు జిల్లాల్లో వరి, పత్తి, మిరప, కంది, పొగాకు విస్తృతంగా సాగు చేస్తారు. ప్రధాన పంటల సాగుకు వాతావరణం అనుకూలించడం లేదు. మెట్ట పైర్ల సాగుకు పొలాలను రైతులు దుక్కి చేసుకున్నారు. వరి సాగు కోసం దుక్కులు దున్నేందుకు సాహసం చేయడం లేదు. వర్షాభావం ఇలానే కొనసాగితే సాగుకు గడ్డు కాలమేనన్న ఆందోళన అన్నదాతల నుంచి వ్యక్తమవుతోంది.

మేరికపూడి ప్రాంతంలో విత్తనం విత్తేందుకు అచ్చు తోలుతున్న రైతు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మూడు జిల్లాల్లోని 59 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. పల్నాడు జిల్లాలో 28 మండలాలకు గాను ఒక్క మాచర్లలో మాత్రమే అత్యధిక వర్షపాతం నమోదైంది. 16 మండలాల్లో అత్యధిక లోటు, 8 మండలాల్లో లోటు, మూడు మండలాల్లో సాధా రణ వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో 40 మి.మీ సాధారణ వర్ష పాతం నమోదు కావాలి. అయితే ఇప్పటికి 18.2 మి.మీ వర్షపాతం నమో దైనట్లు వాతావరణ (మిగతా 6వ పేజీలో)

రోహిణిలో ఊరించిన వర్షాలు.. మృగశిరలో ముఖం చాటేశాయి. మృగశిరకు స్వాగతం పలుకుతూ అన్నదాతలు కోటి ఆశలతో ఉత్సా హంగా ఏరువాక సాగారు. పొలాలను దుక్కులు దున్ని సాగుకు సమాయత్త మయ్యారు. కానీ, చినుకు రాలక పోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నా రు. వర్షాలు కురవక పోవడంతో పంటల సాగు జాప్యం అయ్యే పరిస్థితులు ఏర్ప డ్డాయి. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవడం, ప్రాజెక్టులు నిండటంతో పంట లను విస్తృతంగా రైతులు సాగు చేశారు. వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా అక్కడక్కడ చిరు జల్లులు తప్పా పంటల సాగుకు అనుకూలమైన వర్షాలు కురవలేదు.

నేటి నుంచి చేపల వేట ప్రారంభం

- ముగిసిన విరామం.. బోట్లు సిద్ధం



నిజాపంట్నం హార్బర్‌లో వేటకు వెళ్ళేందుకు సిద్ధం చేసిన బోట్లు

రేపల్లె, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని సముద్రతీరం ప్రాంతమైన నిజాంపట్నం హార్బర్, లంకేవానిదిబ్బ, కొత్తపాలెం, నక్షత్రనగర్‌బీచ్‌ల్లో చేపలవేట విరామసమయం ముగియటంతో సోమవారం నుంచి సముద్రంలో వేట కొనసాగించేందుకు మత్స్యకారులు బోట్లను సిద్ధంచేసుకున్నారు. తెల్లవారుజాము 3గంటలనుంచే హార్బర్‌లో గంగపుత్రులు సముద్రమ్మతల్లికిబోట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేటకు పయనమయ్యేందుకు అన్నిఏర్పాట్లు చేసుకున్నారు. చిన్నపెద్ద బోట్లు సుమారు 700పైనే ఉన్నాయి. 2వేల కుటుంబాలు సముద్రవేట చేసుకుంటూ జీవనాన్ని గడుపుతున్నారు. ఈఏడాది మత్స్యసంపద అధికంగా దక్కాలని ఆకాంక్షిస్తున్నారు. నేటినుంచి వేట ప్రారంభంకానుంది.

పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆర్థికంగా పైకి తేవడానికి సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి దాతల సహకారంతో పాటు ప్రభుత్వం వైపు నుంచి కూడా అన్ని విధాలుగా ఊతమిచ్చి పీ-4ను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగు లేస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో పీ-4కు అర్హత కలిగిన బంగారు కుటుం బాల జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. మార్గదర్శకుల జాబితా కూడా దాదాపుగా సిద్ధమయింది. పీ-4 అమలు పర్యవేక్షణకు మండలాల వారీగా ప్రత్యేక అధికారుల నియామకం కూడా జరిగింది. పీ-4 అమలు తీరుతెన్ను లకు సంబంధించి తాజాగా అన్ని విభాగాల అధికారులతో సమావేశమైన కలెక్టర్ ఆగస్టు నెల నుంచి అమలు చేసేలా కసరత్తు చేస్తున్నారు.

పీ-4కు అంతా సిద్ధం!



పీ4కు సంబంధించి అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి (ఫైల్ ఫొటో)

- కొలిక్కి వచ్చిన బంగారు కుటుంబాల సర్వే
- పేదరికంలో 60,560 కుటుంబాలు
- మార్గదర్శకులకు అనుసంధానం చేసే దిశగా చర్యలు
- ఆగస్టు నుంచి పూర్తిస్థాయిలో అమలు
- ప్రత్యేక అధికారుల నియామకం
- నేడు 12 బంగారు కుటుంబాలకు పీ4 సాయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సచివాలయాల వారీగా చేపట్టిన సర్వేలో జిల్లా వ్యాప్తంగా 60,560 కుటుం బాలు కడు పేదరి కంలో ఉన్నట్లు గుర్తించారు. వీరందరిని బంగారు కుటుంబాల జాబితాలో చేర్చి పీ-4 అమలుపై దృష్టి సారించారు. 229 మంది మార్గదర్శకు లను అధికారులు సమీకరించగలిగారు. వివిధ విభా గాలకు చెందిన జిల్లా అధికారులను కూడా మార్గ దర్శకుల జాబితాలో చేర్చి ఆ కుటుంబాలకు ప్ర భుత్వ పథకాలన్నీ అందేలా వారు చర్యలు తీసు కునేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వీటితో పాటు బంగారు కుటుంబాలతో గ్రామాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి వారిని స్వయం సాధికారతవైపు నడిపించనున్నారు. బ్యాంకుల నుంచి రుణ సదుపాయాలతో పాటు మహిళలకు ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ వంటివన్నీ కూడా ఇచ్చేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లనున్నారు

బంగారు కుటుంబాల జాబితా భారీగా...

పీ-4 సర్వే మొదలయినప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో బంగారు కుటుంబాలు 40,000లోపే ఉండనున్నాయని అధికారులు భావించారు. కానీ సర్వే పూర్తయ్యేసరికి జాబితా 60,560గా తేలడంతో వీరందరికి మార్గదర్శకులను చూడడం కూడా యంత్రాంగానికి సవాల్‌గా మారింది. బంగారు కుటుంబాలకు అండగా ఉండడానికి ఇప్పటికి 229 మంది మార్గదర్శకులు ముందుకొచ్చారు. కానీ ఆసరా కోరుకుంటున్న కుటుంబాలు భారీగా ఉండడంతో మండలాల వారీగా మార్గద ర్శకుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టారు. ఒక్క ఆర్థిక ఊతమే కాకుండా ఉపాధి కల్పన, పిల్లల చదువు వంటి వాటి కి అంగీకారం తెలిపే వారిని కూడా మార్గదర్శకుల జాబితాలో చేర్చాలని నిర్ణయించారు. ఇంతకుముందు ఒక్క మార్గదర్శకుడికి 5 బంగారు కుటుంబా లను అప్పగించాలనే ఆలోచనను అధికారులు చేశారు. కానీ జాబితా భారీగా ఉండడంతో ఒక్కొక్కరికి 10 బంగారు కుటుంబాల బాధ్యత ఇవ్వనున్నారు



పీ4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబం స్థితిగతులను పరిశీలిస్తున్న బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి (ఫైల్ ఫొటో)

నేతల పాత్రే కీలకం

పీ-4 విజయవంతం కావాలంటే ప్రధానంగా నేతల సహకారమే కావాల్సి ఉంది. ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలలో ఆర్థికంగా బలంగా ఉండి సొసైటీకి కొంతైనా తిరిగివ్వాలనే భావన ఉన్నవారెవరో సహజంగా నేతలకే తెలిసి ఉండే అవకాశమే ఎక్కువగా ఉంది. వీరిని మార్గదర్శకులుగా మార్చడంలో నేతల పాత్రే కీలకం కానుంది. పీ-4 అమలును ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో అమలు పురోగతిపై ఇటీవలే కలెక్టర్ వెంకటమురళి అన్ని విభాగాల అధికారులతో పూర్తిస్థాయి సమీక్ష జరిపారు.

నేడు 12 కుటుంబాలకు సాయం

పీ-4 అమలులో భాగంగా సోమవారం 12 బంగారు కుటుం బాలకు డీఆర్‌డీఏ సారథ్యంలో సాయం అందించనున్నారు. పింఛన్ల పంపిణీలో భాగంగా ఏప్రిల్ 1న చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలెం వచ్చిన సీఎం చంద్రబాబు గ్రామంలో పీ-4ను ప్రణాళిక బద్ధంగా అమలు చేసి స్వర్ణ గ్రామంగా తీర్చిదిద్దా లని అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇద్దరు మార్గదర్శకులను కూడా అదే వేదికపై సీఎం పరిచయం చేయడంతో పాటు బంగారు కుటుంబాలకు వారి ని అనుసంధానం చేశారు. గ్రామంలోని మొత్తం 33 కుటుంబా లను పీ-4 పథకం అమలులో భాగంగా పేదరికం నుంచి బయటపడేసేలా అధికారులు ఇప్పటికే చర్యలు ప్రారంభించారు.

ఉన్నట్టా.. లేనట్టా!?



- వ్యవసాయ శాఖలో బదిలీల గందరగోళం
- జీఓ విడుదలై వారం దాటినా రిలీవ్ చేయని వైనం
- తలలు పట్టుకుంటున్న డీడీఏ, ఏడీఏలు
- ఒకరిద్దరి కోసం అందరితో ఆటలు

గుంటూరు సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో బదిలీల వ్యవహారం గందర గోళంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు అధికారులను బదిలీ చేస్తున్నట్లు గత వారం ప్రభుత్వం జీవో విడుదల చేసినా దాన్ని అమలు పరచక పోవడం చర్చనీయాంశంగా మారింది. అసలు ఎందుకు రిలీవ్ చేయడం లేదో అర్థం కాక చాలా మంది అధికారులు టెన్షన్‌తో తల లు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలో బదిలీల కోసమని ప్రభుత్వం విధించిన గడువు కూడా ముగిసింది. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య బదిలీల సందర్భంలో మొదలైన గిల్లికజ్జాలకు మాత్రం ఫులుస్టాప్ పడకపోవడం అధికారుల పాలిట శాపంగా మారినట్లు చెబుతున్నారు.



బదిలీ జీవోను పక్కన పెట్టించడానికి ప్రధాన కారణం జోన్ -1, 2లో జరిగిన పొరపాట్లు అని తెలుస్తోంది. అయితే జోన్-3 కిందకు వచ్చే ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అటువంటివి జరగలేదన్నది అధికారుల వాదన. ఒకరిద్దరి కోసం అందరినీ ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 30 మంది

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 30 మంది వ్యవసాయ అధికారుల బదిలీ వ్యవహారం ఎటూ తేలకుండా ఉంది. వారిలో పలువురు డీడీఏలు, ఏడీఏలు ఉన్నారు. బదిలీ జీఓ విడుదలైన ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత (మిగతా 6వ పేజీలో)

ఆముదాల లంక, జువ్వలపాలెం రీచ్‌ల వద్ద పోలీసుల గస్తీ

భట్టిప్రోలు, కొల్లూరు జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు మండలం జువ్వలపాలెం కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం ఆమదాలలంక ఇసుక రీచ్‌ల వద్ద పోలీసులు గస్తీ నిర్వహించాలని అవనిగడ్డ, రేపల్లె డీఎస్పీలు శ్రీవిద్య, ఎ.శ్రీనివాసరావులు చర్యలు చేపట్టారు. ఆదివారం ఆముదాల లంక వద్ద ఇసుక రీచ్‌ను అవనిగడ్డ డీఎస్పీ పరిశీలించారు. ఇసుక త్రవ్వకాలకు సంబంధించి సరిహద్దులు విభేదాలు రావడంతో ఎవరు ఇసుక అక్రమ తవ్వకాలు చేయకుండా ఉండేందుకు పోలీసులు గస్తీ ఉండాలని డీఎస్పీ తెలిపారు. చల్లపల్లి ఎస్ఐతో పాటు కొల్లూరు, భట్టిప్రోలు ఎస్ఐలు కూడా జువ్వలపాలెం, ఆముదాలలంక రీచ్‌ల వద్ద ఇసుక తవ్వకాలను నిరోధించేందుకు సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



ఆముదాల లంక వద్ద ఇసుక రీచ్‌లను పరిశీలిస్తున్న అవనిగడ్డ డీఎస్పీ శ్రీవిద్య, పోలీసు అధికారులు

బర్లీ కొనుగోళ్ల భారం రాష్ట్ర ప్రభుత్వానిదే..!

- పొగాకు బోర్డు కార్పస్ ఫండ్ ఇచ్చేందుకు కేంద్ర మంత్రి గోయల్ ససేమిరా
- ఆ నిధి అన్ని రాష్ట్రాలకు సంబంధించినదని వ్యాఖ్య
- మిన్నకుండిపోయిన రాష్ట్ర, జిల్లా ప్రజాప్రతినిధులు



సమీక్షలో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, మంత్రి టీజీ భరత్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హై డెన్సిటీ బర్లీ పొగాకు కొనుగోళ్ల భారం రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ గుంటూరు నగరంలో పొగాకు బోర్డు సందర్శన సందర్భంగా బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు కేంద్రం సాయాన్ని ప్రకటిస్తారని అంతా ఆశించారు. అయితే ఆయన బర్లీ పొగాకు ప్రస్తావన జోలికి పోలేదు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పాల్గొన్న ఈ సమీక్షలో ఒకరిద్దరు బర్లీ పొగాకు అంశాన్ని ప్రస్తావించారు. పొగాకు బోర్డు వేలం కేంద్రాల్లో పొగాకు అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి ఒక శాతం ఫీజుని వసూలు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ వద్ద రూ.వందల కోట్ల నిధులు కార్పస్ ఫండ్ రూపంలో ఉన్నాయి. వాటి నుంచి కొంత మొత్తంలో నిధులను బర్లీ పొగాకు కొనుగోళ్లకు కేటాయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశంలో లేవనెత్తగా.. అందుకు కేంద్ర మంత్రి గోయల్ సున్నితంగా తిరస్కరించారు. పొగాకు బోర్డు కార్పస్ ఫండ్ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సంబంధించిందన్నారు. దీంతో ఇక రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా మార్కెట్ కమిటీల్లో బర్లీ పొగాకు కొనుగోళ్లను చేపట్టాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. రైతుల నుంచి 20 మిలియన్ కేజీల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలంటే కనీసం రూ.300 కోట్లు అవసరమవుతాయి. అందులో సగం రూ.150 కోట్లు బోర్డు నుంచి కేటాయించమని కోరినా మంత్రి నుంచి సానుకూల స్పందన రాలేదు.

ఎన్ఐడీ, ఇండస్ట్రియల్ పార్కులపై సమీక్ష..

నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ) గురించి మంత్రి గోయల్ సమీక్ష చేశారు. అమరావతి రాజధానిలో సగల హంగులతో ఎన్ఐడీ భవనాల నిర్మాణం చాలా వరకు పూర్తయింది. విద్యార్థులకు తరగతులు కూడా నిర్వహిస్తున్నామని అధికారులు నివేదించడంతో.. మంత్రి గోయల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ఐడీలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పైనా మంత్రి గోయల్ సమీక్షించారు. రాష్ట్రంలో నిర్మాణం జరుగుతున్న కృష్ణపట్నం పార్కు గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. దీని తర్వాత మరో మూడు ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉన్నతా ధికారి ఎన్.యువరాజ్, టుబాకో బోర్డు ఈడీ విశ్వశ్రీ, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జేసీ భార్గవ తేజ, డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు, మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు, డీడీ దివాకర్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

అల్లుకున్న నిర్లక్ష్యం

● గాలివీస్తే కే.రాజుపాలెంలో విద్యుత్ బంద్

● ట్రాన్స్‌ఫార్మర్‌ను కమ్మేసిన చిల్లచెట్లు



కే.రాజుపాలెంలో పిచ్చి మొక్కలు అల్లుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బల్లికురవ. జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కే.రాజుపాలెం గ్రామంలో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. గతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కావడం శిథిలావస్థకు చేరడంతో చిన్నపాటి గాలి వీచినా, విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు పెద్దఎత్తున పిచ్చి మొక్కలు అల్లుకొని ఉన్న వాటిని తొలగించ లేదని వారు పేర్కొంటు న్నారు. విద్యుత్‌శాఖ అధికారులు గ్రామంపై పర్యవేక్షణ చేపట్టడం లేదని ప్రజలు తెలిపారు. బల్లికురవ, మార్టూరు మండలాల పరిధిలోని కే.రాజుపాలెం, రాజుపాలెం గ్రామాలలో గ్రానైట్ పరిశ్రమలు కూడా ఉన్నాయని విద్యుత్ సరఫరా లేకపోతే తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పరిశ్రమల నిర్వాహకులు తెలిపారు. అన్ని గ్రామాలలో వలే విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను స్తంభాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంతిమయాత్ర వాహనం ఏర్పాటు



దాత సిద్ధం చేసిన అంతిమయాత్ర వాహనం

ఇంకొల్లు,జూన్ 15, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లుకు చెందిన ఓ దాత తన తండ్రి నార్నె రాఘవయ్య జ్ఞాపకార్థం సుమారు రూ.3 లక్షలతో అంతిమయాత్ర వాహనాన్ని సిద్ధం చేశారు. ఈ వాహనం ఇంకొల్లు శ్మశాన నిర్వహణ కమిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. ఇంకొల్లు పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అంతిమయాత్ర వాహనం అవసరాన్ని గుర్తించి దీనిని ఏర్పాటు చేయనున్నట్లు దాత తెలిపారు. వాహన ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

పర్చూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యంసేవిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మందుబాబులను హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆదివారం కారంచేడు మండలంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం, నూనె వితరణ



బియ్యం, నూనె అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమానికి బియ్యం, నూనె అందజేశారు. డాక్టర్ సోమేపల్లి కావ్య (యూఎస్ఏ) పుట్టిన రోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు సోమేపల్లి హనుమంతరావు, అనంతలక్ష్మి సౌజన్యంతో శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమానికి 5 టిక్కిల బియ్యం, ఒక టిన్ నూనెను అందజేసినట్లు రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య పుట్టిన రోజు కేకును వృద్ధుల సమక్షంలో కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అద్దంకి లేవి ప్రసాద్, రావూరి రంగయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఆళహరి హరిప్రసాద్, అంజాద్‌బాషా, శేషారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థలాల కేటాయింపునకు సన్నాహాలు

● తమకు కేటాయించే ప్రాంతాన్ని పరిశీలించిన కార్పెంటర్లు



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పెంటర్లు

అద్దంకి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని కార్పెంటర్లకు అద్దంకి కొండ వద్ద స్థలాలు కేటాయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అద్దంకి పట్టణంలో సుమారు 150 మంది కార్పెంటర్లు వివిధ పనులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అద్దంకి పట్టణంలోని పలువురు కార్పెంటర్లు తమకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయిస్తే సొంతగా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటామని, అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. మంత్రి రవికుమార్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు అద్దంకికొండ వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంట్లు చొప్పున, రోడ్లు, ఇతర అవసరాలకు మొత్తం 3 ఎకరాల స్థలం అవసరమని ప్రాథమిక అంచనాకు వచ్చారు. తమకు కేటాయించనున్న ప్రాంతాన్ని ఆదివారం కార్పెంటర్లు పరిశీలించారు. అద్దంకి పట్టణ కార్పెంటర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు చెన్నకేశవులు, నాగేశ్వరరావు, పూర్ణ, సుభాని, వెంకటేశ్వర్లు, యేజెండ్ల ఆంజనేయులు, కోటిలింగాచారి, వీరసుందరాచారి తదితరలు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ చీరాల నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

చీరాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవమైంది. మండల కార్యాలయంలో తహసీల్దార్ గోపీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఎన్నికలో మేనేజింగ్ కమిటీ సభ్యులుగా బూదరాజు శశికిరణ్, దాసరి ఇమ్మానియేల్, డా.ఐ.బాబురావు, డా.తాడివలస కుమార్, సూరంపల్లి తేజస్వి, మంకెన మణిబాబు, త్రోవగుంట అబ్దుల్, జంగిలి సాయికృష్ణ, మద్దిన వెంకటేశ్వర్లు, రాం ప్రసాద్, ఏకగ్రీమయ్యారు. దీంతో వారికి అభినందనలు తెలిపారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా

● కొప్పెరపాడు కొండ ప్రాంతంలో జోరుగా మట్టి తవ్వకాలు ● పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, అటవీ శాఖలు



గుర్రాల కొండ వద్ద పెద్ద ఎత్తున జరుగుతున్న మట్టి తవ్వకాలు

బల్లికురవ. జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు సమీపంలోని గుర్రాలకొండ ప్రాంతంలో రెండు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి కొందరు మట్టి తవ్వకాలను జోరుగా చేపడుతున్నారు. మట్టిట్రాక్టర్‌కు నగదు తీసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా యధేచ్ఛగా మట్టి తవ్వకాలు చేయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కొప్పెరపాడు నుంచి వినుకొండ రోడ్డులోని గుర్రాల కొండ సమీపంలో ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు తరలిస్తున్నారు. రియల్ వెంచర్లకు, ఖాళీ స్థలాలకు ఈ మట్టిని విక్రయిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం ఉదయం సుమారు పది ట్రాక్టర్లు ఏర్పాటు చేసి ఎర్ర మట్టిని తవ్వి తరలించారు. గత రెండు రోజుల నుండి ఇలానే మట్టిని తవ్వుతున్నా ఎవరు పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. అటవీ భూమి పరిధిలోని కొండ ప్రక్కనే మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఫారెస్టు అధికారులు లేనప్పుడు వారి భూములలో కూడా రాత్రుళ్లు మట్టిని తరలిస్తున్నారు. అధికారులు వచ్చిన సమయంలో తాము పట్టాభూముల్లో మట్టి తవ్వుతున్నట్లు చెబుతున్నారు. మట్టిని తవ్వే అక్రమార్కులు వారికి అవసరమైన సమయంలో యంత్రాల ద్వారా మట్టిని తవ్వుతున్న మైనింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు గుర్రాలకొండను పరిశీలించి అక్రమ మట్టి తవ్వకాలను నిరోధించాలని రైతులు కోరుతున్నారు. మట్టి తవ్వకాలు చేసిన చోట పెద్ద పెద్ద కందకాలు పెడుతున్నారని వీటి వలన వర్షాలు పడితే నీరు నిలిచి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెంతున్నారు.

అటవీ భూములలో మట్టి తవ్వితే చర్యలు

అటవీ భూములలో ఎవరైన మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కూకట్లపల్లి ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె . రమేష్ హెచ్చరించారు. కొప్పెరపాడు గుర్రాలకొండ వద్ద మట్టి తవ్వకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో పరిశీలించామన్నారు. ఒక రైతు పట్టా భూమిలోమట్టి తీస్తున్నారని గతంలో కొండ భూమిలో కూడా కొంత తవ్విన్నట్లు ఉందన్నారు. ఎవరైన అనుమతులు లేకుండా ఫారెస్టు భూమిలో మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నియోజకవర్గ అభివృద్ధికే తొలి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే కొండయ్య ● వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరిక



టీడీపీ కండువాతో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం అభివృద్ధికే తన మొదటి ప్రాధాన్యత అని ప్రతి కార్యకర్త ఆ దిశగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని వాడరేవు గ్రామంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. గ్రామ వైసీపీ కీలక నేతలు మాజీ సర్పంచ్ ఎరిపిల్లి రమణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చాపల గాలెయ్య, జాతీయ మత్స్యకార సంఘం నాయకులు అర్జిల్లి సత్తిబాబు, మాజీ ఉపసర్పంచ్ రాజారావు మరో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పార్టీ కండువాలతో వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు పథకాలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేత లు చాపల బ్రహ్మయ్య గ్రామ కమిటి అధ్యక్షులు బొంది గురవయ్య, ఆతిన శ్రీనివాసరావు, పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగార్పమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

వేటపాలెం మండల పరిధిలోని నాగార్పమ్మ దేవస్థానంలో ఆదివారం ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటి ప్రతినిధులు, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈక్రమంలో పూజలు అనంతరం భక్తులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈపూరుపాలెం లో బూదాటి శంకర్‌రావు ఆధ్వర్యంలో జరుగుతున్న కర్రసాము శిక్షణను పరిశీలించారు. అభినందించారు.

తగ్గిన చికెన్ ధరలు

● పెరిగిన కోళ్ల బరువు, ఉత్పత్తి ● అనుకూలించిన వాతావరణం



చికెన్ దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు

అద్దంకి, జూన్15 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం అంటే మండే ఎండలతో ఫారాలలో కోళ్ల పెంపకం తగ్గుతోంది. అదే సమయంలో ఎండలకు ఉత్పత్తి పడిపోతుంది. అయితే ఈ ఏడాది వేసవికాలంలోనూ ఎండలు తగ్గాయి. అదే సమయంలో వాతావరణం చల్లబడింది. దీనికితోడు ఎయిర్ కండీషన్ కోళ్ల ఫారాలు బాగా పెరిగాయి. దీంతో కోళ్ల ఫారాల్లో కోళ్ల పెంపకం పెరగడంతో పాటు తక్కువ కాలంలోనే బరువు కూడా పెరిగాయి. దీంతో అంచనాలకు మించి ఉత్పత్తి వచ్చింది. ఈ నేపథ్యంలో చికెన్ ధరలు మండేకాలంలో ఒక్కసారిగా తగ్గాయి. ఇటీవల వరకు కిలో చికెన్ రూ.200 నుండి రూ.220 వరకు ఉండగా ప్రస్తుతం అద్దంకిలో కిలో చికెన్ రూ.150లకు తగ్గింది. దీంతో కొనుగోలుదారులు చికెన్ కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. అద్దంకిలో చికెన్ దుకాణాలు ఆదివారం మాంసం ప్రియులతో కిటకిటలాడాయి.

తహసీల్దార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది ?

● అవినీతి ఆరోపణల నేపథ్యంలో తహసీల్దార్ సరెండర్

● డీటీ శ్రీకాంత్ డిప్యుటేషన్‌పై బదిలీ

● మరో రెండు రోజుల్లో వీఆర్‌వోలపై చర్యలు

వేటపాలెం(చీరాల), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల తహసీల్దార్ కార్యాలయంలో గత రెండు రోజులుగా ఏం జరుగుతుందో అంతుపట్టడం లేదు. తహసీల్దార్ పార్వతిని రెండు రోజుల క్రితం సీసీఎల్ఏకు సరెండర్ చేస్తూ కలెక్టర్ వెంకట మురళీ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే తాజాగా డీటీ శ్రీకాంత్‌ను డిప్యుటేషన్‌పై నిజాంపట్నానికి పంపుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మరో రెండు రోజుల్లో ఇద్దరు వీఆర్‌వోలపై వేటు పడనుందని, ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే చీరాల తహసీల్దార్ గోపీకృష్ణకు వేటపాలేనికి ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు

కొంతకాలంగా వేటపాలెం, కొత్తపేట, రామాపురం ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు తహసీల్దార్ పార్వతి, డీటీ శ్రీకాంత్, మరో ఇద్దరు వీఆర్‌వోలు ప్రయత్నించినట్లు రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. అంతేకాకుండా ఉన్నతాధికారుల విచారణలో నూ తహసీల్దార్ పార్వతి విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలిసింది. ఈక్రమంలో ఇటీవల కొంతమేరకు ఉన్నతాధికారులు వేటపాలెం రెవెన్యూ కార్యాలయంపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే అనునిత్యం మండలంలో భూఆక్రమణలు, అనధికార రిసార్ట్స్, అక్రమ లేఅవుట్ల వ్యవహారాలతో ఇక్కడి అధికారులు పత్రికలకెక్కుతూనే ఉన్నారు. నిత్యం ఏదో ఒక అధికారి తీరు చర్చనీయాంశంగానే ఉంటుంది. ఈక్రమంలో తాజాగా మండల కార్యాలయంలో జరుగుతున్న పరిణామాలు అనేక మలుపులు తిరుగుతున్నాయి. ఈ క్రమంలో బదిలీల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



ముప్పవరం ఎస్సీకాలనీలో పాలాభిషేకం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పంగులూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం ఎస్సీ కాలనీ లో పాఠశాల చిన్నారులు, వారి తల్లిదండ్రులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలకు తల్లికివందనం పథకం ద్వారా వారి బ్యాంక్ ఖాతాలలో నగదు జమ కావడంతో ఆదివారం ఎస్సీ కాలనీలోని చర్చి వద్ద సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికివందనం లబ్ధి చేకూరడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వేల్పుల మరియదాసు, పార్టీ నాయకులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, గరిమిడి జగన్మోహనరావు, ఇంటూరి రామకృష్ణ, శివశంకర్, వీరాంజనేయులు, భావన్నారాయణ, సామియేలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన న్యాయాధికారి



విచారిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీష్

చినగంజాం, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామ సచివాలయాన్ని ఒంగోలు సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీష్ ఆదివారం సందర్శించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి, అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇరుపక్షాల ఆస్తి వివాదాలను విచారించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన గొల్లమూరి వెంకటరమణారెడ్డి(వాది), కోమట్ల రామాంజనేయులు, అన్నవరపు భానుప్రకాష్, ఏవీ.భాస్కర్ (ప్రతివాదులు)ల ఆస్తుల వివాదాలను విచారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు, ఎస్ఐ శీలం రమేష్, గ్రామ కార్యదర్శి పీ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఆర్ఐ బండారు దానియేలు, రెవెన్యూ సిబ్బంది, ఒంగోలు, చీరాల కోర్టు సిబ్బంది, మండల పారాలీగల్ వలంటీర్ ఎంవీ. రామారావులు పాల్గొన్నారు.

ఇంకొల్లు విద్యార్థిని మన్వీతకు నీట్‌లో ర్యాంక్



జాగర్లమూడి మన్వీత

ఇంకొల్లు, జూన్ 15,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు గ్రామానికి చెందిన విద్యార్థిని జాగర్లమూడి మన్వీతమహాలక్ష్మీ 534 మార్కులు సాధించి ఆలిండియా నీట్ పరీక్షలలో 20941 ర్యాంకును సాధించింది. జనరల్ క్యాటగిరిలో 8556 స్థానాన్ని దక్కించుకున్నారు. మన్వీత తల్లిదండ్రులు వేణుబాబు, సీతాదేవిలు ఇంకొల్లులో బాలాజి భోజనం హోటల్ నడుపుతుంటారు. మన్వీత మహాలక్ష్మీ చిన్నతనం నుంచి డాక్టరు కావాలనే లక్ష్యంతో కష్టపడి సీటు సంపాదించుకున్నట్లు తెలిపింది. మన్వీతను గ్రామస్థులు, ప్రముఖులు అభినందించారు.

టీటీడీ కల్యాణ మండపంలో ఆధునికీకరణ పనులు ప్రారంభం



కల్యాణమండపంలో చేపడుతున్న మరమ్మతులు

అద్దంకి, జూన్15 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఉన్న టీటీడీ కల్యాణ మండపం సుమారు దశాబ్దకాలం క్రితం నిర్మాణం చేసినా నిరుపయోగంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఈవో తిమ్మానాయుడు ప్రత్యేక దృష్టిసారించి ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. దాతల సహకారంతో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఉన్న భవనాన్ని సెంట్రల్ ఏసీగా చేస్తున్నారు. అదే సమయంలో పక్కనే దాతల సహకారంతో మరో భవనం నిర్మాణం చేపట్టనున్నారు. వీటిలో ఒక దానిని కళ్యాణ మండపంగా, మరో భవనాన్ని డైనింగ్ హాల్ గా వినియోగించనున్నారు. పూర్తి స్థాయిలో కల్యాణ మండపం నిర్మాణం పూర్తయితే సుమారు రెండు వేల మంది హాజరైనా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు ఉండే విధంగా మార్పు చేస్తున్నారు. వివాహాలు, ఇతర కార్యక్రమాలు కల్యాణ మండపంలో జరగడం ద్వారా అక్కడకు వచ్చే వారిలో అత్యధికులు ప్రసన్నాంజనేయస్వామి వారిని కూడా దర్శించుకుంటారు. దీంతో భక్తుల సంఖ్య కూడా పెరుగుతుందన్న అంచనాతో అధికారులు టీటీడీ కల్యాణ మండపం ఆధునీకరణ పనులు చేపడుతున్నారు.



కల్యాణ మండవంలో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ ఏసీ

శాంతిభద్రతల పరిరక్షణకు సహకారం

వేటపాలెం(చీరాల), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ సహకారం ఉంటుందని పలువురు స్థానికులు పేర్కొన్నారు. ఇటీవల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు పత్తి ముత్తుకమరన్, గోవర్ధనరావు, కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్, గొల్లపూడి సుధాకర్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, దోగుపర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంగాభవానీ అలయంలో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

కారంచేడు (పర్చూరు), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలో వేంచేసిన గ్రామ దేవత గంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు రైతులు సిద్ధం కావడంతో పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

ఒకే గొడుగు కిందకు.. బ్యాంకు గ్యారెంటీలు

(5వ పేజీ తరువాయి)

రూ. 5 కోట్ల మధ్యన ఉంటే రూ.లక్ష, రూ.5 కోట్ల కంటే అదనంగా ఉంటే రూ. 2.50 లక్షల బ్యాంకు గ్యారెంటీని ముందుగానే సమర్పించాలి. ఇతర ఉత్పత్తులకు అయితే వరుసగా రూ. లక్ష, రూ.2 లక్షల, రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలు రూ.50 వేలు చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు అన్ని నోటిఫైడ్ వ్యవసాయ ఉత్పత్తులను ఒక గొడుగు కిందకు చేర్చి టర్నోవర్ రూ. కోటి లోపు ఉంటే రూ.2 లక్షలు, రూ. కోటి నుంచి రూ.5 కోట్ల మధ్యన ఉంటే రూ.4 లక్షలు, రూ.5 కోట్ల టర్నోవర్ దాటితే రూ.7 లక్షలు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీలకు ఎంత టర్నోవర్ ఉన్నా రూ.లక్షగా బ్యాంకు గ్యారెంటీని నిర్ణయించారు. ఈ సవరణలు కేవలం కొత్తగా జారీ చేయబోయే కమీషన్ ఏజంట్ లైసెన్సులకు మాత్రమే వర్తింపు చేస్తారు.

మిర్చి యార్డులో కొత్త లైసెన్సుల జారీకి సన్నాహాలు

మిర్చి యార్డులో అతి త్వరలోనే కొత్త కమీషన్ ఏజెంట్ లైసెన్సులు మంజూరు చేయాలని మార్కెటింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలు కొంత మంది పేర్లను మార్కెటింగ్ అధికారులకు నివేదించి వాళ్లకు లైసెన్సులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే దీనిపై మార్కెటింగ్ మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అనుమతి రావాల్సి ఉంది. కాగా మిర్చి యార్డులో లైసెన్సు ఉంటే దానిని లీజుకు తీసుకొని ఏటా రూ.3 లక్షలకు పైగా నగదుని బడా వ్యాపారులు చెల్లిస్తుంటారు. దీంతో కొత్త లైసెన్సు పొందేందుకు రూ. 20 లక్షల వరకు చెల్లించడానికి కూడా వెనుకాడరు.

చినుకు రాలదాయె!

(5వ పేజీ తరువాయి)

శాఖ వెల్లడించింది. 54.5 శాతం లోటు నమోదైంది. రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, బెల్లంకొండ, క్రోసూరు, పెదకూరపాడు, సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు, బొల్లాపల్లి, నూజెండ్ల, శావల్యాపురం, ముప్పాళ్ల, నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం నమోదైంది. దుర్గి, కారంపూడి, అచ్చంపేట, అమరావతి, ఈపూరు, రొంపిచర్ల, నరసరావుపేట, చిలకలూరిపేట మండలాల్లో లోటు వర్షపాతం నెలకొంది.

బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలో 35.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 30.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 14.5 శాతం లోటు ఉంది. 25 మండలాలకు గాను 7 మండలాల్లో అత్యధిక లోటు, 6 మండలాల్లో లోటు, ఆరు మండలాల్లో సాధారణ, ఐదు మండల్లాలో అధిక, ఒక మండటంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. చుండూరు, సంతమాగులూరు, మార్టూరు, యద్దనపూడి, అద్దంకి, కొరిశపాడు, చినగంజాం మండలాల్లో అత్యధిక లోటు, అమృతలూరు, బట్టిప్రోలు, చెరుకుంపల్లె, బల్లికురవ, పర్చూరు, చీరాల మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

గుంటూరు జిల్లాలో..

గుంటూరు జిల్లాలో 22.7 శాతం లోటు వర్షపాతం ఉంది. ఇప్పటి వరకు 48.4 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 37.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 18 మండలాల్లోని 6 మండలాల్లో అత్యధిక లోటు, మరో ఆరు మండలాల్లో లోటు, మూడు మండలాల్లో సాధారణ, ఒక మండలంలో అధిక, రెండు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. మంగళగిరి, తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు, గుంటూరు ఈస్ట్ మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం ఉంది. తుళ్లూరు, తాడేపల్లి, గుంటూరు వెస్ట్, తెనాలి, చేబ్రోలు, వట్టిచెరుకూరు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

ఉన్నట్టా.. లేనట్టా!?

(5వ పేజీ తరువాయి)

సదరు అధికారులు పనిచేసే చోట నుంచి ఉన్న ఫలంగా రిలీవ్ అయ్యేందుకు సిద్ధపడ్డారు. అంతలోనే ఎవరినీ రిలీవ్ చేయవద్దని డీఏఏలకు కమిషనర్ కార్యాలయం నుంచి సందేశం వచ్చింది. 10వ తేదీ నుంచి సవరించిన జాబితా వస్తుంది రిలీవ్ కావచ్చు అని బదిలీ అయిన అధికారులు ఎదురు చూస్తూనే ఉన్నారు. రోజులు గడుస్తున్నా సవరించిన జాబితా విడుదల కాకపోవడం అధికారుల్లో అసహనానికి కారణం అవుతుంది.

మార్పులు జరుగుతాయని..

ఈ నెల 9న విడుదలైన మండల వ్యవసాయ అధికారుల బదిలీ ఉత్తర్వులను తర్వాత సవరించారు. డీడీఏ, ఏడీఏల జాబితానూ సవరిస్తారేమోననే అనుమానం చాలామందిలో ఉంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆరంభమైంది. బదిలీ సంగతి ఏమయ్యిందో తేలకుండా పిల్లల విషయంలో నిర్ణయం తీసుకోవడం కష్టతరమని కొందరు అధికారులు ఆవేదన చెందుతున్నారు.







గాంధీబొమ్మ కూడలిలో రోడ్డుపై వర్షపు నీరు

వర్షం కురిసి.. ఆహ్లాదం పంచి..

పగలంతా ప్రచండుడి భగభగలతో అల్లాడిన నగరవాసులు ఆదివారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షానికి సేదతీరారు. ఉదయం నుంచి ఎండకుతోడు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆ తర్వాత సాయంత్రం వీచిన చల్లని గాలులు ఆహ్లాదం పంచాయి. కొద్దిసేపటికే మోస్తరు వర్షం కురవడంతో తడారిన నేలకు ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. మరోవైపు వీఆర్సీ సెంటర్, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ కూడలి తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీళ్లు నిలవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు.

వహబ్‌పేటలో రోడ్డుపై నీరు నిలవడంతో పాదచారుల అవస్థలు



ఉదయగిరి : నర్రవాడలోని వెంగమాంబ ఆలయంలో పసుపు దంచుతున్న మహిళలు

నర్రవాడలో ఉత్సవ సంబరం

- ప్రారంభమైన వెంగమాంబ బ్రహ్మోత్సవాలు
- వలస వాసుల రాకతో గ్రామాల్లో సందడి



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నర్రవాడలో వెలసి ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. వెంగమాంబ వంశస్తులైన పచ్చవ కుటుంబ సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొచ్చి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వేదపండితులు అమ్మవారిని పుష్పాలంకరణతో విశేషంగా అలంకరించారు. వేదపండితులు భక్తిశ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. కలశాలను మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి సన్నిధికి చేర్చారు. భక్తులు తరలివచ్చి నియమనిష్ఠలతో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. సంతానం లేని మహిళలు అమ్మవారి దగ్గర వరపడ్డారు. చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి.

- వివరాలు 8లో..

రేపటి నుంచి గురువాయురప్పన్ బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని అయ్యప్ప గుడి ప్రాంగణంలోని మహాలక్ష్మీ, గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తు న్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య ఆదివారం ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ నెల 22వతేదీ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. భద్రాచలం సీతారామస్వామి ఆలయ అర్చకుడు ఇళ్వవలి కొండూమూరు స్థల సాయి స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులందరూ తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బీ శ్రీకాంత్‌రెడ్డి, పీటీ జగన్నాథం, కత్తి మోహన్‌రావు, రమణయ్య, కేజీ శంకరన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఆడిట్’ గాడినపడేనా!?

కీలక శాఖలో తిష్ఠ వేసిన ఉద్యోగులు ● తాజా బదిలీల్లో భారీగా స్థానచలనం ● సొంత జిల్లా నుంచి డీఏవో బదిలీ

పంచాయతీలు, మున్సిపాలిటీలు, మార్కెటింగ్ కమిటీలు, దేవాలయాలు వంటి వ్యవస్థల్లో ఆదాయం, ఖర్చుల పర్యవేక్షణలో ఆడిట్ శాఖ పాత్రం కీలకం. ఇంతటి బాధ్యతాయుతమైన శాఖలో ఏళ్ల తరబడి అధికారులు, ఉద్యోగులు పాతుకుపోవడం, వీరిలో మూడొంతుల మంది సొంత జిల్లా వారు కావడంతో అవినీతికి అడ్డులేకుండా పోయింది. మరీ ముఖ్యంగా వైసీపీ హయాంలో రూ.కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టినా ఆడిట్ అధికారులు గుర్తించలేకపోయారు. ఈ అక్రమాల్లో వారికీ భాగమున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ తరుణంలో జిల్లా ఆడిట్ శాఖ ప్రక్షాళనకు ప్రభుత్వం పూనుకుంది.

నెల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఆడిట్ శాఖలోని అధికారులు, ఉద్యోగులను కదిలించింది. తాజాగా జరిగిన బదిలీల్లో మూడొంతుల మంది జిల్లా నుంచి బదిలీ అయ్యారు. ప్రత్యేక పరిస్థితుల్లో మినహా సాధారణంగా జిల్లాస్థాయి పోస్టుల్లో సొంత జిల్లాకు చెందిన వారు ఉండరు. కానీ ఇప్పటివరకూ నెల్లూరు జిల్లాకు చెందిన వారే జిల్లా ఆడిట్ అధికారిగా పని చేస్తున్నారు. ఈయనకు తాజా బదిలీల్లో ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. అలానే జిల్లాలో ఆరుగురు అసిస్టెంట్ ఆడిట్ అధికారులు ఉడగా, ఏకంగా ఐదుగురు బదిలీ అయ్యారు. 26 మంది సీనియర్ ఆడిటర్లలో 17 మంది, పది మంది జూనియర్ ఆడిటర్లలో ఇద్దరికి స్థానచలనం కలిగింది. మరి ఇకనైనా ఆడిట్ శాఖ గాడినపడేనా? పంచాయతీలు, దేవాలయాల్లో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేసేనా? అన్న చర్చ నడుస్తోంది.

● బాధ్యులపై చర్యలేవి!?

పంచాయతీలు, దేవాలయాల్లో ఆడిట్ శాఖ అధికారులు నిర్వహించే ఆడిట్ చాలా కీలకమైనది. ప్రభుత్వం, ఇతర మార్గాల నుంచి వచ్చే నిధులు, ఖర్చులు నిబంధనల ప్రకారం జరిగాయా.. లేదా..? అన్నది ఆ శాఖ చూడాలి. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడటమే ఈ శాఖ కర్తవ్యం. కానీ జిల్లాలో ఆ పరిస్థితులు లేకుండా పోయాయి. ఆడిట్ అధికారులు ఏటా ఆడిట్ నిర్వహించి అంతా పక్కాగా ఉందని నివేదికలు ఇచ్చారు. అయితే ఆ పంచాయతీలు, దేవాలయాల్లో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మరి ఈ విషయాలు నాడు ఆడిట్ అధికారులు ఎందుకు గుర్తించలేకపోయారంటే సమాధానం దొరకడం లేదు. ఇటీవల మేజర్ పంచాయతీల్లో జరిగిన రూ.కోట్ల అవినీతి ఫలితంగా పంచాయతీ కార్యదర్శులు వరుసగా సస్పెండ్ అవుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయా పంచాయతీల్లో ఆడిట్ చేసిన ఆడిట్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ కమిషనర్ సూచించారు. కానీ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులు మాత్రం తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తప్పు చేసినా ఏమీ కాదులే అన్న ధీమాతో ఆడిట్ శాఖలోని అవినీతి అధికారులు, ఉద్యోగులు దర్జాగా తిరుగుతున్నారు.

● సర్వీస్ రిజిస్టర్ ఏమైంది!?

జిల్లా ఆడిట్ కార్యాలయంలో ఓ అసిస్టెంట్ ఆడిట్ అధికారి సర్వీసు రిజిస్టర్ కనిపించడం లేదు. ఇది జరిగి మూడు నెలలు గడిచినా ఇంత వరకూ బాధ్యులపై కనీస చర్యలు తీసుకోలేదు. దీనిని బట్టే జిల్లా ఆడిట్ శాఖలో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాగా ఈ రిజిస్టర్ పోగొట్టిన ఉద్యోగికే మళ్లీ కీలకమైన పెన్షన్ల సీటు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతుండడం గమనార్హం. ఇక కొందరు ఉద్యోగులు సంపాదనకు అలవాటు పడి జిల్లాను వదలనంటున్నారు. ప్రభుత్వం బదిలీ చేసినా.. దొడ్డిదారిలో డిప్యుటేషన్ పేరుతో మళ్లీ జిల్లాలోనే తిష్ఠ వేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

హమ్మయ్య!

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ పూర్తి ● 2 రోజుల్లో విధుల్లో చేరికలు



ఉపాధ్యాయుడికి బదిలీ ఉత్తర్వులు అందచేస్తున్న డీఈఓ బాలాజీరావు

నెల్లూరు (విద్య), జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ ఆదివారం పూర్తయింది. ఇప్పటికే ఉద్యోగోన్నతులు, బదిలీలు పొందిన వారికి ఉత్తర్వులు జారీ చేయగా తాజాగా బదిలీ అయిన సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉత్తర్వులు అందుతున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం వెబ్ కౌన్సెలింగ్ ఆధారంగా బదిలీలు చేపట్టాలని నిర్ణయించిన మేరకు ఉద్యోగోన్నతులు, ఎస్ఏల బదిలీలను చేపట్టి ఉత్తర్వులు అందచేశారు. అయితే ఎస్జీటీలకు మాత్రం మాన్యువల్‌గా కౌన్సెలింగ్ చేపట్టాలని పట్టుబట్టడంతో ఈ ప్రక్రియ కొంత ఆలస్యంగా ప్రారంభమై పూర్తి చేశారు. బదిలీ అయిన వారంతా రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

● 6,106 మంది దరఖాస్తు


జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి 6,106 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం ప్రక్రియను ఈ నెల 11వతేదీ నాటికి పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేసినా అభ్యంతరాలు, వివాదాల కారణంగా ఆదివారానికి పూర్తయింది. మొత్తం దరఖాస్తుల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలు 139, లాంగ్వేజ్ పండిట్ విభాగంలో హిందీ 12, సంస్కృతం 1, తెలుగు 73, ఉర్దూ 2 కలిపి 88 దరఖాస్తులు అందాయి. అలాగే ఫిజికల్ ఎడ్యుకేషన్ 26, ప్రాథమిక పాఠశాలల హెచ్ ఎంలు 82, స్కూల్ అసిస్టెంట్స్ లాంగ్వేజెస్ విభాగంలో ఇంగ్లీష్ 418, హిందీ 270, తెలుగు 400, ఉర్దూ 7, నోసబ్జెక్ట్ 1 కలిపి 1096 మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజెస్ విభాగంలో బయలాజికల్ సైన్స్ 321, మ్యాథ్స్ 566, ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ) 141, ఫిజికల్ సైన్స్ 381, సోషల్ 327, స్పెషల్ ఎడ్యుకేషన్ 12 కలిపి 1748 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 2,927 మంది మొత్తం 6,106 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రత్యేక బృందాలు వీటిని పరిశీలించి తుది జాబితాలను విడుదల చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు.

● ఫిర్యాదులు ఉంటే..

బదిలీ కౌన్సెలింగ్‌లపై ఏదైనా ఫిర్యాదులు ఉంటే మూడు రోజుల్లో అందచేయాలని డీఈఓ బాలాజీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీల్ చేయదలచుకుంటే రీజనల్ స్థాయి కమిటీ అయిన ఆర్జేడీకి, ఆర్జేడీకి వ్యతిరేకంగా అయితే రాష్ట్రస్థాయి కమిటీ అయిన పాఠశాల విద్యా కమిషనర్‌కు అప్పీల్ చేయాలని తెలిపారు. అప్పీల్‌ను 15 రోజుల్లో పరిష్కరించి నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఇతర చట్టపరమైన పరిష్కారాల కోసం వెళ్లే ముందు అన్ని స్థాయిల్లో అప్పీల్ నిబంధనలను ఉపాధ్యాయులు పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

● 4,172 మందికి స్థానచలనం

జిల్లావ్యాప్తంగా 6,106 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 4,172 మందికి స్థానచలనం కలిగింది. జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-2 హెచ్‌ఎంలకు 103 మంది బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు అందచేశారు. ఈ స్థానాల్లో ఖాళీ అయిన వాటికి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 89 మందికి, మున్సిపాలిటీలో 4 కలిపి మొత్తం 93 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. అలాగే ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా అర్హులైన 82 మంది దరఖాస్తు చేసుకోగా వీరికి కూడా కౌన్సెలింగ్ నిర్వహించి 81 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. మొత్తం మీద 174 మందికి ఉద్యోగోన్నతి కల్పించినట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. వీరితోపాటు ఎస్జీటీ తెలుగు 2074 మంది, ఉర్దూ 54 మంది, లాంగ్వేజ్‌పండిట్‌లు 88 మంది, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ 545 మంది, నాన్ లాంగ్వేజెస్ 1134 మందికి బదిలీలు పూర్తయ్యాయి.



సోమశిలలో నీరు నిల్వ

అనంతసాగరం జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో 37.940 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 97 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 3,850, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 700 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నేడు కోనలో యోగాంధ్ర

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం పెంచలకోనలో మెగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

‘సార్.. క్యూలైన్‌లో దర్శనం చేసుకోవాలంటే చాలా ఆలస్యం అవు తుంది. ఎంతోకొంత నాకు ఇవ్వండి. వీఐపీ దర్శనం చేయిస్తా. ఆలయ మర్యాదలూ ఉంటాయి.’ మాలకొండ క్షేత్రంలో కొంతమంది తాత్కాలిక ఉద్యోగుల తీరిది. వీరేకాదు. రాజకీయ నాయకులు, అధికారులూ తమ అనుచరులను, బంధువులను ఇష్టానుసారం వీఐపీ క్యూలైన్లలో స్వామివారి దర్శనానికి పంపుతున్నారు. దీనివల్ల ఆలయ ఆదాయానికి గండపడటమేగాక సాధారణ భక్తుల తీవ్ర ఇబ్బందిగా మారింది.



మాలకొండలో లక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం వీఐపీ క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

టికెట్ వద్దండి.. మాకిస్తే చాలండి!

- వీఐపీ దర్శనం చేయిస్తాం
- మాలకొండలో కొంతమంది సిబ్బంది తీరిది
- అధికార, రాజకీయ నాయకులదీ అదే తీరు
- ఆలయ ఆదాయానికి భారీగా గండి

వలేటివారిపాలెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మాలకొండలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన 109 మంది సిబ్బంది ఉన్నారు. నెలలో 4 శనివారాలు మాత్రమే వీరు పని చేస్తారు. ఇందుకుగాను ఒక్కొక్కరికి రూ. 3500 చొప్పున ఇస్తారు. వారంలో శనివారం మాత్రమే తెరిచే ఈ ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తారు. దీంతో స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీన్నే ఆసరాగా చేసుకుని తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అంతసేపు క్యూలైన్‌లో వేచి ఉండలేనివారు తాత్కాలిక సిబ్బంది అడిగినంత ఇచ్చి టికెట్ లేకుండానే నేరుగా వీఐపీ దర్శనం ద్వారా సకల మర్యాదలు చేస్తారు. దీంతో ఆలయ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. మరోవైపు దేవుడి హుండీలో పడాల్సిన భక్తుల కానుకలు కూడా గుమాస్తాల జేబుల్లోకి వెళ్తున్నాయి. అక్కడే పనిచేసే తాత్కాలిక సిబ్బంది కొందరు తమ విధులను పక్కన పెట్టి ఇదే పనిలో ఉన్నారు. వీళ్లతోపాటు భద్రతా సిబ్బంది కూడా ఇదే పనిలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక రాజకీయ ద్వితీయ శ్రేణులు కూడా తమ అనుచరులను దర్శనం టిక్కెట్లు లేకుండానే భక్తులను వీఐపీ క్యూలైన్‌లో పంపిస్తున్నారు. వీరేగాక అధికారులు, వారితో వచ్చే అనుచరులు టికెట్ లేకుండానే దర్శనానికి వెళ్తున్నారు. దీంతో ఆలయ ఆదాయానికి వేలల్లో గండిపడుతోంది. ఇలా దాదాపు వెయ్యి మందికిపైగా టికెట్ లేకుండానే స్వామివారి దర్శనానికి వీఐపీ క్యూలైన్‌లో వెళుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అప్పుడపుడు క్యూలైన్‌లో ఉన్న సాధారణ భక్తులు సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి తాత్కాలిక సిబ్బందిపై నిఘా పెట్టి ఆలయ ఆదాయానికి గండిపడకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

● భక్తులపై కొండ తేనెటీగలు దాడి

మాలకొండకు వచ్చిన భక్తులపై శనివారం కొండ తేనెటీగలు దాడి చేశాయి. ఆ దాడిలో పలువురు గాయపడ్డారు. నరసింహస్వామి దర్శనం ముగించుకొని మహాలక్ష్మ్మ అమ్మవారు దర్శనానికి చీలిన కొండ మెట్ల దారిలో భక్తులు వెళుతున్నారు. అమ్మవారి ఆలయ పక్కన రావిచెట్టుకు కొండ తేనెటీగల తేనెతుట్టె పెట్టి ఉంది. ఆ తేనెతుట్టెను కోతులు కదిలించడంతో కొండ తేనెటీగలు ఒక్కసారిగా భక్తులపై దాడి చేశాయి. దీంతో భక్తులు మెట్లమార్గంలో పడుతూ లేస్తూ పరుగులు పెట్టారు. దీంతో పలువురు కిందపడి గాయపడ్డారు. వీరికి ప్రథమ చికిత్స కేంద్రంలో చికిత్స చేశారు. రావిచెట్టుకు పెట్టిన తేనెటీగలు తుట్టెను సిబ్బంది తొలగించాలి. అయితే ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

1.77 లక్షల మందికి అన్నదాత సుఖీభవ

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి జిల్లాలో 1.17 లక్షల మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి వద్ద ఈకేవైసీ చేసిన రైతులు మాత్రమే పథకానికి అర్హులని పేర్కొన్నారు. కాబట్టి రైతులు తప్పనిసరిగా తమ ఆధార్ నెంబరుతో వారి భూమి, బ్యాంకు ఎన్‌పీసీఐ లింక్ జరగడంతోపాటు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20వేలు మూడు దఫాలుగా పీఎం కిసాన్‌తో కలిపి జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

రొట్టెల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయండి!

దర్గాలో భారీస్థాయిలో ప్రార్థన మందిరం నిర్మాణం

అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పండుగ అయిన బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయన అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలిసి రొట్టెల పండుగ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. దర్గా అభివృద్ధికి సీఎం మంజూరు చేసిన రూ.5కోట్లతో ఈద్గా మైదానంలోని ప్రార్థనా మందిరంలో ఒకేసారి 20వేల మంది ప్రార్థనలు చేసుకునేలా నిర్మిస్తున్నట్లు చెప్పారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఈ పనులను నుడా ద్వారా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్‌లతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

● పనుల సాగదీతపై ఆగ్రహం

నగర సుందరీకరణలో భాగంగా అండర్ పాసులు, ఓవర్ బ్రిడ్జి, ఓవర్ హెడ్‌ట్యాంకు పనులు సంవత్సర కాలంగా కొనసాగడంపై సంబంధిత అధికారులపై మంత్రి నారాయణ మండిపడ్డారు. రాబోయే 45రోజుల్లో రంగులు వేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

● త్వరలో టెండర్లు పిలుస్తాం..

రొట్టెల పండుగ సందర్భంగా నుడా ఆధ్వర్యంలో ప్రార్థనా మందిరం నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తామని నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, మున్సిపల్, నుడా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కలువాయి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో సోమవారం జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ జీ.వెంకటేశ్వర్లు నాయుడు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హాజరవు తారని తెలిపారు. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొనాలని ఆయన కోరారు.

న్యూస్ బాక్స్

వృద్ధులు, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు

అల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం సామాజిక నేరమని లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధులపై వేధింపుల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన పలు విషయాలను పేర్కొన్నారు. నేటి సమాజంలో పలువురు తమ తల్లిదండ్రులను, వయోవృద్ధులను చిన్నచూపు చూస్తున్నారని, వారిని గౌరవించాల్సి ఉందని పేర్కొన్నారు. 2007లో కేంద్ర ప్రభుత్వం వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చిందని, దీని ద్వారా వేధింపులకు గురైన వయోవృద్ధులు న్యాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా కష్టపడి చదివించిన తల్లిదండ్రుల పోషణా బాధ్యతలను విస్మరిస్తే చట్టపరంగా పోషణ నిర్వహణ ప్రతిఫలాన్ని పొందే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు భారమనుకొని వృద్ధాశ్రమాలకు తరలించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకోదండరామ స్వామి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చివరిరోజు స్వామివారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేశారు. అనంతరం పారువేట, వసంతోత్సవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గంగాభవాని ఉత్సవాలు ప్రారంభం: గంగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీఅనంతపూరిగంగాభవాని అమ్మవారి ఉత్సవాలు ఆదివారం నిలుపు కార్యక్రమంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చరిత్రను వివరించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో అమ్మవారిని ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు అమలు చేయాలి

కందుకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి పక్కనే రామదూత ఆశ్రమం పేరుతో దొంగస్వామి ఆక్రమించిన చెరువు పోరంబోకు భూమిని, అటవీభూమిని తక్షణం స్వాధీనం చేసుకుని అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ జారీచేసిన ఆదేశాలను అమలుచేయాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తక్షణం ఆ భూములను స్వాధీనం చేసుకోకుంటే స్థానిక అధికారులు హైకోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

శేషసాయి మందిరంలో..

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట ద్వారకా నగరులోని షిరిడీ శేషసాయి మందిరంలో ఆదివారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర ఆవరణలో పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు మందిర వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, వసుంధర దంపతులు అన్నసంతర్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేషసాయినాథుని విగ్రహ ప్రతిష్ఠ చేసి 25 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా జూలై 10న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, రాష్ట్రస్థాయిలో ఎద్దుల బండ లాగుడు ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని వైఆర్ జూనియర్ కళాశాలలో శేగు సుబ్బారావు, నిర్మలాదేవి, ఎన్ఆర్ఐ శేగు సతీష్ దాతృత్వంతో జూన్ 6 నుంచి నిర్వహిస్తున్న శంకర నేత్రాలయం చెన్నై వారి ఉచిత కంటి వైద్య శిబిరం 9వ రోజు ముగింపుకు చేరింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నై నుంచి వచ్చిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ గజేంద్రకుమార్ వర్మ మాట్లాడుతూ మొత్తం 883 మందికి పరీక్షలు నిర్వహించగా 170 మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. శంకర నేత్రాలయం ప్రజా సంబంధాల అధికారి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఆర్ఐ అయిన శేగు సతీష్, అతని కుటుంబం ఆర్థిక సాయంతో పాటు, సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వనిపెంట హైమావతి, వనిపెంట సుబ్బారెడ్డి, నిర్వాహకులు యల్లాల రఘురామిరెడ్డి, పలుకూరు వెంగయ్య, మందాడి శ్రీనివాసరెడ్డి, తిరుపాలు, చలమయ్య, కందల మధు, కొండారెడ్డి, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, డాక్టర్ యల్లాల అనీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ యల్లాల శ్రీనిధి పాల్గొన్నారు.

- పని చేయని ఫ్యాన్లు, ఉక్కపోతతో అవస్థలు
- తాగునీరు, బాత్‌రూమ్‌ల కరువు
- చాలావరకు మరమ్మతులకు గురైన మిషన్లు
- పట్టించుకోని అధికారులు

ఉచిత టైలరింగ్ శిక్షణలో

వసతులేవి?..

సంగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రంలో కనీస మౌలిక వసతులు కూడా లేక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలంలో అయితే మహిళలు తాగునీటికి కూడా అల్లాడాల్సిన పరిస్థితి. అంతేకాకుండా చాలావరకు కుట్టు మిషన్లు మరమ్మతులకు గురవడంతో పట్టించుకునే నాథులే లేరు. దీంతో టైలరింగ్‌కు వచ్చే మహిళలు అసౌకర్యాల నడుమ శిక్షణ పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మండల కేంద్రమైన సంగంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. సుమారు 120 మందికి పైగా దరఖాస్తు చేసుకోవడంతో రెండు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ఇచ్చేందుకు ఒక మాస్టర్ టైలర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఆమె ఆధ్వర్యంలో రెండు నెలలుగా శిక్షణ జరుగుతోంది. ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్న 2 గంటల నుంచి 5గంటల వరకు మరో బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ కోసం ప్రభుత్వం 25 కుట్టు మిషన్లను సరఫరా చేసింది. అయితే శిక్షణ ప్రారంభమైన కొద్ది రోజులకే 10 మిషన్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ విషయంపై అధికారులకు తెలిపినా వారు పట్టించుకోకపోవడమే కాకుండా శిక్షకులే రిపేర్ చేయించుకోవాలని సమాధానం ఇస్తున్నారు. దీంతో ఒక్కొక్క మిషన్ మీద ముగ్గురు లేక నలుగురు టైలరింగ్ నేర్చుకోవాల్సివస్తోంది. ఒకరు మిషన్ వద్ద కూర్చుంటే మిగతా వారు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. దీంతో సమయం వృథా అవుతుందని మహిళలు వాపోతున్నారు.



టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

కనీస వసతులూ కరువే..

కుట్టు శిక్షణకు వచ్చిన మహిళలకు శిక్షణ కేంద్రంలో కనీసం మరుగుదొడ్డి వసతి కూడా లేదు. ఫ్యాన్లు పనిచేయడం లేదు, అలాగే తాగేందుకు మంచినీరు ఏర్పాటు చేయకపోవడంతో ఇంటి వద్ద నుంచే వాటర్ బాటిల్ తీసుకుని రావలసి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతి మహిళ తన సొంత ఖర్చులతో (వస్త్రం తెచ్చుకుని) మూడు డ్రస్సులు కుట్టి చూపించాలని నిబంధన ఉంది. దీంతో ప్రతినిత్యం రాకపోకల చార్జీల ఖర్చులే నెలకు రూ. 1000లు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎఫ్ఆర్ఎస్ హాజరు అమలు

కుట్టు శిక్షణకు వచ్చే మహిళలకు ఎఫ్ఆర్ఎస్ హాజరు అమలు చేస్తున్నారు. దీంతో ఉదయం 10 గంటలకు వస్తేనే హాజరు లేకపోతే యాప్ క్లోజ్ అవుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు ఇది ఎంతో ఇబ్బందికరంగా ఉంది. శిక్షణకు వచ్చే మహిళలకు రానుపోను స్టయిఫండ్‌తో పాటు మ్యానువల్ హాజరు అమలు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అలాగే శిక్షణ కేంద్రంలో తాగునీరు, ఫ్యాన్లు, కుట్టు మిషన్లను మరమ్మతులు చేయించడం వంటి కనీస వసతులు ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు.



నాగారపమ్మదేవికి హారతులిస్తున్న అర్చకుడు

నాగారపమ్మదేవికి ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో వెలసి ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి అనంతరం పూలంగిసేవ ఏర్పాటు చేశారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కోటేశ్వరస్వామికి శేషవాహన సేవ

సంగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో వెలసి ఉన్న కోటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి కోటేశ్వరస్వామి శేషవాహనసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై ఉంచి గజపూలమాలలతో అలంకరించారు. అనంతరం విద్యుత్ దీపాల నడుమ మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

గురుపూర్ణిమను విజయవంతం చేయండి

అల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమ వేడుకలను విజయవంతం చేయాలని స్థానిక పేటలోని షిరిడీ సాయిబాబా మందిర కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం ఆలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 10వ తేదీన నిర్వహించే గురుపూర్ణిమను పురస్కరించుకొని చేపట్టే సామూహిక లక్ష మల్లెల పూజలో పాల్గొనే భక్తులు వారి గోత్ర నామాలను అర్చకులకు, కమిటీ సభ్యులకు అందజేయాలన్నారు. ఉదయం 9గంటలకు ఆలయానికి చేరుకొని పూజలో పాల్గొనాలని కోరారు. ఈసందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో యరమాక వెంకటశేషారెడ్డి, మేడా రమణారెడ్డి, కుందా వెంకట కృష్ణారెడ్డి, పూండ్ల మధుసూదన్‌రెడ్డి, కామకొలను వెంకట రాధాకృష్ణారావు, శివకల్యాణ్‌రెడ్డి, చంద్రమోహన్‌రాజు, మస్తానయ్య, మధు, అర్చకులు కార్తీక్ శర్మ, సుబ్బారావు శర్మ తదితరులు పాల్గొన్నారు.



శేషవాహనంపై దర్శనమిస్తున్న కోటేశ్వరస్వామి

ఉదయగిరిలో వర్షం

ఉదయగిరి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. వర్షంతో మురుగు కాలువలు పొంగిపొర్లాయి. చెత్తాచెదారం రోడ్డుపై చేరడంతో వాహనదారులు, పాదాచారులు అవస్థలు ఎదుర్కొన్నారు. కొన్నిరోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు. ఇప్పటికే రైతులు ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు భూములు దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు. ఈ వర్షంతో మరింత అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.



ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఉత్తమ ఫలితాలు

కందుకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) విద్యార్థులు సెకండ్ సెమిస్టర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ కె శ్రీనివాసులుతో కలిసి ఫలితాలను విడుదల చేసిన రవికుమార్ మాట్లాడుతూ బీఏలో 85 శాతం, బీఎస్సీలో 84శాతం, బీకాంలో 72శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కళాశాలలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, ఇతర సైన్స్ ల్యాబ్‌లతో పాటు విద్యార్థినులకు క్యాంపస్‌లోనే వసతిగృహం సదుపాయాలు ఉన్నాయని, ప్రత్యేకంగా ఉపాధి నైపుణ్య శిక్షణ, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలతో క్యాంపస్‌లోనే ఉద్యోగాలు పొందేలా తర్ఫీదునిస్తున్నందున విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విద్యాసంవత్సరం నుంచి నూతనంగా బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ ఉపాధి కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జె హనుమంతరావు, పి రాజగోపాలబాబు, టి హరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను కోఆప్షన్ సభ్యులుగా నియమించాలి

కావలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థలైన పంచాయతీలు, మండల పరిషత్‌లు, మున్సిపాల్టీలలో దివ్యాంగులను కోఆప్షన్ సభ్యులుగా నియమించాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం దివ్యాంగులతో సమావేశం నిర్వహించి వారి హక్కుల గురించి వివరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగులను స్థానిక సంస్థలలో కోఆప్షన్ సభ్యులుగా నియమించకపోతే ఉద్యమం చేపట్టాల్సి వస్తుందన్నారు. అలాగే దివ్యాంగులకు నివేశన స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు మండవ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయుడి ప్రచారం

అనంతసాగరం జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరిక కోసం ఆ పాఠశాల ఉపాధ్యాయుడైన దివ్యాంగుడు అల్లాబక్షు విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని, అన్ని వసతులతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. వికలాంగుడైన అలాబక్షు చేస్తున్న కృషిని స్థానికులు అభినందిస్తున్నారు.



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అల్లాబక్షు

జూనియర్ లైన్‌మన్‌కు ఆర్థిక సాయం

కొండాపురం, జూన్ 15 (ఆంధ్ర జ్యోతి): పార్లపల్లి సచివాలయ పరిధిలో జూనియర్ లైన్‌మన్‌గా పని చేస్తున్న బృగుమళ్ల మహేష్ విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు కోల్పోయాడు. దీంతో విశ్వబ్రాహ్మణులు వైద్యఖర్చుల నిమిత్తం ఆదివారం రూ. 1,04,700 బాధితుని తండ్రి శ్రీహరికి అందచేశారు. ఈకార్యక్రమంలో టి బ్రహ్మానందాచారి, కంచర్ల కేశవాచారి, నారాయణాచారి, పరమేశ్వరాచారి, శానంపూడి నారాయణ, వెగ్గళం లక్ష్మినరసయ్య, బాల బ్రాహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.



మహేష్ తండ్రి శ్రీహరికి నగదు అందచేస్తున్న విశ్వబ్రాహ్మణులు

రెడ్‌క్రాస్‌కు ఎమ్మెల్యే అభినందనలు

కావలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ 2023-24, 2024-25 సంవత్సరాలకు రక్తసేకరణలో ప్రతిభ కనబరచినందుకు రాష్ట్రస్థాయిలో 5 అవార్డులను అందుకున్న సందర్భంగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అభినందించారు. ఆదివారం రెడ్‌క్రాస్ బాధ్యులు సాధించిన అవార్డులతో ఎమ్మెల్యేను కలిశారు. దీంతో ఆయన వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, వైస్ చైర్మన్ కే హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, ప్రణీత్, జీ రాజకుమార్‌చౌదరి, మోడరన్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.



సాధించిన అవార్డులను ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి చూపిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

● డాక్టర్ ప్రభాకర్ నాయుడి జన్మదిన వేడుకలు


కావలి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ మున్సిపల్ చైర్మన్, వైద్యరత్న బిరుదాంకితుడు డాక్టర్ ప్రభాకర్ నాయు డి జన్మదిన వేడుకలను ఆదివారం ఆయన అభిమానులు, మిత్రులు, స్వచ్ఛంద సంస్థలు ఆయన ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డితో పాటు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ రబ్బాని, జనరల్ మెడిసిన్ దినేష్ రెడ్డి(అపోలో) పాల్గొన్నారు. అనంతరం ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభిం చారు. వివిధ పార్టీల నేతలు, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, అభిమానులు ప్రభాకర్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, ఎస్కె మస్తాన్, శ్రీహరినాయుడు, పొట్లూరు శ్రీనివాసులు, ఐఎంఏ వైద్యులు, రోటరీ క్లబ్, రెడ్‌క్రాస్ బాధ్యులు పాల్గొన్నారు.

10 అడుగులకు తగ్గిన

రాళ్లపాడు నీటిమట్టం

- ఉత్తర కాలువ వెడల్పు పనులతో నిలిచిన నీటి సరఫరా

లింగసముద్రం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 10 అడుగులకు పడిపోయింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఎలాంటి నీటి ప్రవాహం రావడం లేదని ప్రాజెక్టు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. అలాగే ప్రాజెక్టు నుంచి ఎలాంటి అవుట్‌ఫ్లో కూడా వెళ్లడం లేదని, ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు కూడా నీటి సరఫరా నిలిపి వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న 10 అడుగుల నీరు తాగునీటి పథకాలకు సరఫరా చేసేందుకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఈనీరు మరో ఆరేడు నెలల పాటు వస్తుందని ఆయన తెలిపారు. ప్రాజెక్టులోని నీరు తాగునీటి పథకాలకు రోజుకు 7 క్యూసెక్కులు, నీరు ఆవిరి రూపంలో, గేట్ల నుండి లీకేజీ రూపంలో 10 క్యూసెక్కుల నీరు పోతుందన్నారు. అలాగే సోమశిల జలాశయం నుంచి కూడా ఉత్తర కాలువ ద్వారా నీరు రావడం లేదని, 80 కి.మీ దగ్గర నుంచి మర్రిగుంట చెరువు వైపు కాలువ వెడల్పు పనులు జరుగుతున్నాయని, అందువలన నీరు ఉత్తర కాలువ ద్వారా రావడం లేదని, పనులు పూర్తయితే రాళ్లపాడు ప్రాజెక్టులోకి నీరు సమృద్ధిగా వచ్చే అవకాశం ఉందన్నారు.



రాళ్లపాడు ప్రాజెక్టులో 10 అడుగులకు తగ్గిన నీటిమట్టం

వృద్ధులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ



వృద్ధురాలికి నగదు అందచేస్తున్న కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో వెంగ శరావునగర్‌లోని ఆ సమితి కార్యాలయం లో ఆదివారం వృద్ధులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ విశ్వో దయ విద్యాసంస్థల నిర్వాహకులు విద్యా ర్థులకు మంచి విద్యను అందించడమే కాక సమాజానికి సేవ చేయడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో రెక్టార్ వినయ్‌కుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామ క్రిష్ణ, సతీష్‌సింగ్, నర్సింగ్ కాలేజి అధ్యా పకురాలు దివ్య పాల్గొన్నారు.

మన చక్రాలను శుద్ధి చేసే దివ్య ఔషధమే ధ్యానం

- ఒంగోలు మాస్టర్ దులేఖాబీ



దులేఖాబిని సత్కరిస్తున్న ధ్యానులు


వింజమూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మానవ శరీరంలోని ఏడు చక్రాలను శుద్ధి చేసి పరిపూర్ణమైన మానవుడిగా తయారయ్యేందుకు ధ్యానం చక్కగా ఉపయోగపడుతుందని ఒంగోలు సీనియర్ పిరమిడ్ మాస్టర్ దులేఖాబీ అన్నారు. వింజమూరులోని శ్రీవేదవ్యాస వశిష్ఠ పరిమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా ఆమె పాల్గొని మాట్లాడారు. మన శరీరంలోని ఏడు చక్రాల గురించి ఆమె వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. ఆత్మజ్ఞానాన్ని అందించిన దులేఖాబీని ధ్యానులందరూ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హేమలత, సుబ్బలక్ష్మీ, రాజేశ్వరి, జయప్రదలతో పాటు 40 మంది ధ్యానులు పాల్గొన్నారు.

గొడవ పడొద్దన్నందుకు దాడి

- పోలీసులకు ఫిర్యాదు

కొండాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గొడవ పడొద్దన్నందుకు షేక్ ఖాజామస్తాన్ అనే వ్యక్తి తనపై దాడిచేశాడని మండలంలోని కొమ్మి గ్రామానికి చెందిన మన్నవ వెంకటసుబ్బయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని బ్రహ్మంగారి మఠంవద్ద గ్రామానికి చెందిన కె వీరాచారి, నజీర్, చిన్నబోయిన మహేంద్ర, షేక్ చాన్‌బాషా మరికొంతమందితో కలిసి మాట్లాడుకుంటుండగా షేక్ ఖాజామస్తాన్ అక్కడకు వచ్చి నజీర్ అనే వ్యక్తిని తిడుతుండగా ఎందుకు తిడుతున్నావని అడగ్గా కర్రతో దాడి చేశాడని, దీంతో అక్కడ ఉన్నవారు అతడిని మందలించి పంపించేశారు. దీంతో నీ అంతు చూస్తానని చెప్పి ఖాజామస్తాన్ అతని మోటారుసైకిల్‌ను తనే తగులబెట్టుకొని గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేశాడని, గ్రామంలో విచారించి న్యాయం చేయాలని బాధితుడు మన్నం వెంకటసుబ్బయ్య పోలీసులను కోరాడు.

రేపు పొగాకు రైతుల సదస్సు



పొగాకు రైతు సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు

కందుకూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ మంగళవారం కందుకూరులో పొగాకు రైతుల సదస్సు జరుగుతుందని, దీనిని జయప్రదం చేయాలని రైతుసంఘం నెల్లూరు జిల్లా సీనియర్ నాయకుడు ముప్పరాజు కోటయ్య కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో పొగాకు రైతు సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ రైతాంగం ఎన్నో వ్యయప్రయాసల కోర్చి పొగాకు సాగు చేయగా మార్కెట్లో లభిస్తున్న ధరలు తీవ్ర నిరాశపరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఏడాది పొగాకు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితులు కనిపిస్తున్నందున ప్రభుత్వం తక్షణం వారిని ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో రైతు సంఘం నాయకులు మాదాల రమణయ్య, జీ వెంకటేశ్వర్లు, ఎస్ ఏ గౌస్, వరబ్రహ్మకుమార్, డీఎం రాయుడు తదితరులు పాల్గొన్నారు.